


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 17-06-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 242 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# ఆరోగ్యానికి భరోసా

## ఆరోగ్య రంగానికి రూ.11,419.44 కోట్లు

## రూ. 2,24,789.18 కోట్లతో ఏపీ బడ్జెట్



అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రెండోదఫా వార్షిక ఆర్థిక బడ్జెట్‌ను (2020-21) ప్రవేశపెట్టింది. రూ.2,24,789.18 కోట్ల అంచనా వ్యయంతో సంక్షేమ బడ్జెట్‌ను ప్రభుత్వం రూపొందించింది. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మండలిలో ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అభివృద్ధి, సంక్షేమం సమ్మిళితం చేసేలా బడ్జెట్‌ను రూపొందించారు. అచ్చమైన తెలుగు కవితతో అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి కవితతో ముగించారు. గంటన్నరకు పైగా బుగ్గన బడ్జెట్ ప్రసంగం అద్యంతం ఎంతో ఆసక్తికరంగా సాగింది.

**ఏపీ బడ్జెట్(2020-21) ప్రధాన అంశాలు**

రూ.2,24,789.18 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్, రెవెన్యూ వ్యయం అంచనా రూ.1,80,392.65 కోట్లు

మూలధన వ్యయం అంచనా రూ.44,396.54 కోట్లు

ఈ సారి బడ్జెట్‌లో ఈ రంగాలకు భారీగా అదనపు కేటాయింపులు

బీసీ సంక్షేమానికి గతేడాది కంటే 270 శాతం అదనంగా కేటాయింపులు

మైనార్టీ సంక్షేమానికి గతేడాది కంటే 115 శాతం అదనంగా కేటాయింపులు

సాంఘిక సంక్షేమానికి

తరువాయి 2లో..

# విశాఖనే పరిపాలన రాజధాని

- శాసన రాజధానిగా అమరావతి ● న్యాయ రాజధానిగా కర్నూలు
- గత అనుభవాలు దృష్టిలో ఉంచుకొని పరిపాలన వికేంద్రీకరణ
- ఆరోగ్యశ్రీ కింద 6.25 మందికి లబ్ధి
- మేనిఫెస్టోలో లేని 40 హామీలు అమలు
- 5.5 లక్షల కరోనా పరీక్షలు పూర్తి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



అమరావతి : పరిపాలన వికేంద్రీకరణ అత్యంత కీలకమైన అంశంగా ప్రభుత్వం భావిస్తోందని గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మూడు రాజధానులు ఏర్పాటు శాసన ప్రక్రియలో ఉందని స్పష్టం చేశారు. శాసన రాజధానిగా అమరావతి, కార్యానిర్వాహక రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు ఉంటుందని మరోసారి గుర్తుచేశారు. శాసనసభ, మండలి బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ ఈ అంశాన్నిపునరుద్ఘాటించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పరిపాలన వికేంద్రీకరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిలు రచించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే ఇప్పటికే అభివృద్ధిలో దూసుకు పోతున్న విశాఖను పరిపాలన

తరువాయి 2లో..

# కరోనాను ధీటుగా ఎదుర్కొంటున్నాం

## రాష్ట్రాల సీఎంలతో ప్రధాని భేటీ



న్యూఢిల్లీ : నావెల్ కరోనా వైరస్ వ్యాప్తి రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై పీఎం మోడీ రాష్ట్రాల సీఎంలతో మేదోమథనం చేశారు. 21 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ... రాష్ట్రాల సహకారంతో కరోనా వైరస్‌పై భారత్ దీటుగా పోరాడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కోవిడ్-19 బారినపడి కోలుకునే వారి సంఖ్య 50 శాతం దాటిందని వెల్లడించారు. మహమ్మారిపై పోరు మన సహకార సమాఖ్య విధాన స్ఫూర్తిని చాటిందని చెప్పారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ కరోనా మహమ్మారితో మెరుగ్గా పోరాడుతోందని, మనపై మహమ్మారి ప్రభావం కొంతమేర తక్కువేనని చెప్పుకొచ్చారు. దేశంలో కరోనా వైరస్ పరిస్థితి, లాక్‌డౌన్ నిబంధనల అమలుపై ప్రధాని మంగళవారం పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. జూన్ 30తో లాక్‌డౌన్ ముగియనుండటంతో చేపట్టాల్సిన చర్యలపై సీఎంలతో చర్చించారు.

గత కొద్దివారాలుగా పలు దేశాల నుంచి పెద్దసంఖ్యలో భారతీయులు, వలస కూలీలు స్వస్థలాలకు చేరుకున్నారని చెప్పారు. సుదీర్ఘ లాక్‌డౌన్ అనంతరం పలు సడలింపులు ప్రకటించిన అనంతరం ఆర్థిక

తరువాయి 2లో..

# మద్యం అమ్మకాలపై హైకోర్టులో విచారణ




అమరావతి: కొవిడ్ సమయంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో ఇవాళ విచారణ జరిగింది. ప్రభుత్వం ఒక వైపు దశలవారీగా మద్యనిషేధం అని చెబుతూ కొవిడ్ సమయంలో మద్యం విక్రయించడం సరికాదని పిటిషనర్ తరపు న్యాయవాది డీఎస్ ఎన్వీ ప్రసాద్ కోర్టులో వాదించారు. గత మూడు రోజులుగా రాష్ట్రంలో కొవిడ్ బాధితుల సంఖ్య పెరుగతూ పోతోందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, మద్యం అమ్మకాలకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇరువురి వాదనలు విన్న ధర్మాసనం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు సంబంధించి ప్రతిని తమ ముందు ఉంచాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తత

## ఘర్షణలో సూర్యాపేట వాసి మృతి





న్యూఢిల్లీ : ఒకవైపు ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్చలు జరుగుతుంటే.. మరో వైపు గాల్వన్ వ్యాలీలో చైనా బలగాలు తెగింపు ప్రదర్శించిన తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. లడఖ్‌లో కొన్నాళ్ల నుంచి కొనసాగుతున్న టెన్షన్ వాతావరణం.. ఇప్పుడు హైవోల్ట్ సమస్యగా మారింది. కాల్పులు జరగకుండానే.. జరిగిన బాహాబాహీలు ముగ్గరు భారతీయ సైనికులు మృతిచెందారు. చైనా దళాలు జరిపిన దాడిలో ఓ కల్నల్‌తో పాటు ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయింది. దీంతో లడఖ్ లోయలో పరిస్థితి అత్యంత భీకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత 40 ఏళ్లలో రెండు దేశాల మధ్య ఇలాంటి హింసాత్మక ఘటన జరగలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గాల్వన్ ఘటన పట్ల మాజీ ప్రధాని దేవగౌడ స్పందించారు. ఆ ఘటన చాలా కలిచివేసినట్లు ఆయన తెలిపారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో భారతీయ సైనికులు ఎందుకు ప్రాణాలు కోల్పోయారని ఆయన ప్రశ్నించారు. తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా ఆయన ఈ ప్రశ్న వేశారు. జాతి ప్రయోజనాలను ఉద్దేశించి.. ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్..

తరువాయి 2లో..

# ఏపీలో మరో 264 కరోనా కేసులు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వ్యాప్తి కొనసాగుతోంది. గడచిన 24 గంటల్లో 15,911 మంది నమూనాలు పరీక్షించగా 264 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్టు వైద్య ఆరోగ్యశాఖ బులిటెన్‌లో తెలిపింది. అయితే, వీటిలో విదేశాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన వారివే 71 ఉండగా.. రాష్ట్రంలో 193 పాజిటివ్ కేసులు వచ్చాయి. పొరుగు దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో కలిపి రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 6,720 కేసులు నమోదయ్యాయి. కొవిడ్ కారణంగా గడచిన 24 గంటల్లో ఇద్దరు మృతి చెందారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు కొవిడ్ కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 88కి చేరింది. ఇప్పటి వరకు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది కోలుకుని డిశ్చార్జి అయిన వారి సంఖ్య 2851 చేరింది. ప్రస్తుతం వివిధ కొవిడ్ ఆసుపత్రుల్లో 2341 మంది చికిత్స పొందుతున్నారు.




## పార్టీలు మారడం

# ఆయన నైజం

## : మంత్రి పేర్ని నాని



అమరావతి: నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. పార్టీలు మారడం రఘురామకృష్ణంరాజు నైజమని విమర్శించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ఆనాడు టీడీపీ నామినేషన్, బీజేపీ నామినేషన్, స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసి ఎందుకు విత్ డ్రా చేసుకున్నారని

తరువాయి 2లో..

# అసెంబ్లీకి నల్లచొక్కాలతో తెదేపా నేతలు





అమరావతి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా తెదేపా అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. చంద్రబాబుతో సహ పార్టీనేతలంతా నల్లచొక్కాలు ధరించి కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ తెదేపా నేతలు అసెంబ్లీ సమావేశాలకు నారా లోకేశ్ నేతృత్వంలో పాదయాత్రగా వెళ్లారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి విధ్వంస పాలన సాగిస్తున్నారని నేతలు నినాదాలు చేశారు. అసెంబ్లీ సమీపంలోని అగ్నిమాపక కేంద్రం నుంచి సభాప్రాంగణం వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... సొంత అజెండాను అమలు చేసుకునేందుకే అసెంబ్లీ సమావేశాలను రెండు రోజులకే పరిమితం చేశారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు

తరువాయి 2లో..

# కలెక్టర్ కార్యాలయంలో సెన్సార్ శానిటైజర్ ఏర్పాటు



శ్రీకాకుళం : కరోనా నివారణ చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సెన్సార్ శానిటైజర్ ను భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్.బి.ఐ) ఏర్పాటు చేసింది. ఈ సెన్సార్ శానిటైజర్ ను జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి మంగళ వారం ప్రారంభించారు. చేతులను శానిటైజర్ కు తాకకుండా చేతులు శానిటైజర్ డ్రాప్ పాయింట్ వద్ద పెట్టగానే శానిటైజర్ ద్రావణం పడుతుంది. జిల్లా రెవిన్యూ అధికారి దయానిధి మాట్లాడుతూ సెన్సార్ శానిటైజర్ ఉపయోగకరమైనదన్నారు. వైరస్ ఏ పదార్థం మీదనైనా ఉండవచ్చని తద్వారా ఒక వ్యక్తికి సోకే అకాశం ఉంటుందని అన్నారు. సెన్సార్ శానిటైజింగ్ మెషిన్ ద్వారా తాకకుండానే శానిటైజ్ చేసే అవకాశం ఉండటం వలన వైరస్ ప్రభావం ఉండదన్నారు. కరోనాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ తరచూ శానిటైజ్ చేసుకోవాలని, మాస్కు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని కోరారు. ఇళ్ళు, ఆఫీసు, దుకాణం, మార్కెట్ ఏ ప్రాంతమైనా దూరం పాటించడం రక్షణగా ఉంటుందని అన్నారు. ఎస్.బి.ఐ రీజనల్ మేనేజర్ ఏ.వి.ఎస్.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జన రద్దీ ఉండే జిల్లా కలెక్టర్ కార్యాలయం వంటి ప్రదేశాల్లో సెన్సార్ శానిటైజర్ ఆవశ్యకత ఉందనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసామన్నారు. మరికొన్ని రద్దీగా ఉండే కార్యాలయాల్లో వీటిని సామాజిక బాధ్యత క్రింద ఏర్పాటు చేయుటకు చర్యలు చేపడతామన్నారు. కరోనా నివారణలో ఎస్.బి.ఐ భాగం కావలనే ఉద్దేశ్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ చీఫ్ మేనేజర్ జి.వి.సుబ్బారావు, సిబ్బంది సాహు, కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి భరోసా

**మొదటి పేజీ తరువాయి**

గతేడాది కంటే 110 శాతం అదనంగా కేటాయింపులు

మహిళా, శిశు సంక్షేమానికి గతేడాది కంటే 28 శాతం అదనంగా కేటాయింపులు

**వివిధ రంగాల వారీగా బడ్జెట్ కేటాయింపులు**

వ్యవసాయ రంగానికి రూ. 11,891 కోట్లు

ఆరోగ్య రంగానికి రూ.11,419.44 కోట్లుపశుగణాభివృద్ధి, మత్స్యరంగానికి రూ.1279.78 కోట్లు

గృహ నిర్మాణ రంగానికి రూ.3,691.79 కోట్లు

హెూంశాఖకు రూ.5,988.72 కోట్లు

జలవనరుల శాఖకు రూ. 11,805.74 కోట్లు





పెట్టుబడులు, మౌలిక వసతుల రంగానికి రూ.696.62 కోట్లు

- ఐటీ రంగానికి రూ. 197.37 కోట్లు
- కార్మిక సంక్షేమానికి రూ. 601.37 కోట్లు
- పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌కు రూ. 16710.34 కోట్లు
- న్యాయశాఖకు రూ. 913.76 కోట్లు
- మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖలకు రూ. 8150.24 కోట్లు
- స్కిల్ డెవలప్‌మెంట్‌కు రూ. 856.64 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ. 3,520.85 కోట్లు
- ఆర్థిక రంగానికి రూ. 50,703 కోట్లు
- విద్యుత్ రంగానికి రూ. 6,984.72 కోట్లు
- ప్రాథమిక ఉన్నత విద్యకు రూ. 22,604.01 కోట్లు
- సోషల్ వెల్ఫేర్ కోసం రూ.12,465.85 కోట్లు
- ట్రాన్స్‌పోర్టు, ఆర్అండ్‌బీ కోసం రూ.6,588.58 కోట్లు
- మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం రూ.3456.02 కోట్లు
- మైనార్టీ సంక్షేమానికి రూ.2,055.63 కోట్లు
- ప్రణాళిక రంగానికి రూ.515.87 కోట్లు
- పర్యావరణం, అటవీశాఖకు రూ.457.32 కోట్లు
- సాధారణ పరిపాలనకు రూ.878.01 కోట్లు
- ఎస్సీల సంక్షేమానికి రూ.15,735 కోట్లు
- గిరిజనుల సంక్షేమానికి రూ.5,177.54 కోట్లు
- కాపుల సంక్షేమానికి రూ.2,846.47 కోట్లు
- ఎస్సీ, ఎస్టీ గృహాల ఉచిత విద్యుత్‌కు రూ.425.93 కోట్లు
- 104, 108 వాహన సేవలకు రూ.470.29 కోట్లు
- గ్రామీణాభివృద్ధికి రూ.16,710 కోట్లు
- సాగునీటి పారుదల శాఖకు రూ.11,805 కోట్లు
- రవాణా రంగానికి రూ.6,588 కోట్లు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కోసం రూ. 2100 కోట్లు
- నేషనల్ హెల్త్ మిషన్ కోసం రూ. 1808.03 కోట్లు

**సవరించిన అంచనాలు 2019-20**

సవరించిన అంచనాల ప్రకారం రెవెన్యూ వ్యయం రూ. 1,37,518.07 కోట్లు

మూలధన వ్యయం రూ. 12,845.49 కోట్లు

రెవెన్యూ లోటు దాదాపుగా రూ. 26,646.92 కోట్లు

ఆర్థిక లోటు దాదాపుగా 40,493.46 కోట్లు







ఇవి రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 2.47 శాతం, 3.75 శాతం?

**వివిధ పథకాలు, మౌలిక వసుతుల కోసం బడ్జెట్ కేటాయింపులు**

- వైఎస్సార్ లా నేస్తం కోసం రూ. 12. 75 కోట్లు
- రైతులకు విత్తనాల పంపిణీ కోసం రూ.200 కోట్లు
- జగనన్న విద్యాకానుక కోసం రూ.500 కోట్లు
- ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం కోసం రూ. 55.15 కోట్లు
- కొత్త రాజధానిలో మౌలిక వసతుల కోసం రూ. 500 కోట్లు
- ప్రతిభ స్కాలర్‌షిప్స్ కోసం రూ. 10.54 కోట్లు
- నేషనల్ హార్టికల్చర్ మిషన్ రూ. 150.99 కోట్లు
- పట్టణ స్వయం సహాయక బృందాల కోసం రూ. 389.89 కోట్లు
- రైతులకిచ్చే నష్ట పరిహారం కోసం రూ. 20 కోట్లు
- గ్రామ సచివాలయాల కోసం రూ. 1633 కోట్లు
- అమరావతి-అనంతపురం నేషనల్ హైవే కోసం రూ. 100 కోట్లు
- వైఎస్సార్ గృహ వసతి కోసం రూ. 3 వేల కోట్లు
- డ్రగ్స్, మందుల కేంద్రీకృత కొనుగోళ్ల కోసం రూ. 400 కోట్లు
- కుటుంబ సంక్షేమ కేంద్రాల కోసం రూ. 242.15 కోట్లు
- వ్యవసాయ మార్కెట్ల మౌలిక సదుపాయాల నిధి రూ. 100 కోట్లు
- అగ్రిగోల్డ్ బాధితులకు రూ.200 కోట్లు
- వైఎస్సార్ సంపూర్ణ పౌషణ పథకానికి రూ.1500 కోట్లు
- డ్వాక్రా మహిళల సున్నా వడ్డీ పథకానికి రూ.1365.08 కోట్లు
- వైఎస్సార్ పెన్షన్ కానుకకు రూ.16వేల కోట్లు
- జగనన్న అమ్మఒడి పథకానికి రూ.6వేల కోట్లు
- వైఎస్సార్ చేయూత పథకానికి రూ.3వేల కోట్లు
- వైఎస్సార్ ఆసరా పథకానికి రూ.6,300 కోట్లు

వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి రూ.275.52 కోట్లు

- వైఎస్సార్ నేతన్ననేస్తం పథకానికి రూ.200 కోట్లు
- జగనన్న తోడు పథకానికి రూ.930 కోట్లు
- జగనన్న చేదోడు పథకానికి రూ.247 కోట్లు
- -- గ్రామ,వార్డు సచివాలయ వాలంటీర్ల వ్యవస్థకు రూ.46.46 కోట్లు
- రియల్ టైం గవర్నెన్స్ కోసం రూ.54.51 కోట్లు
- వ్యవసాయ ల్యాబ్‌లకు రూ.65 కోట్లు
- వైఎస్ఆర్ రైతుభరోసా - పీఎం కిసాన్‌కు రూ.3,615.60 కోట్లు
- డాక్టర్ వైఎస్ఆర్ పంటల ఉచిత బీమా పథకానికి రూ.500 కోట్లు
- జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలో ఉన్నత విద్యకు రూ.2,277 కోట్లు
- డాక్టర్ వైఎస్సార్ పంటల ఉచిత బీమా పథకానికి రూ.500 కోట్లు
- వడ్డీలేని రుణాల కోసం రూ.1100 కోట్లు
- 2018-19లో స్థూల ఉత్పత్తి 8 శాతమే పెరిగింది

బడ్జెట్ ప్రసంగంలో బుగ్గన

దేశప్రజలు గొప్పవాళ్లయితేనే దేశం గొప్పదవుతుంది. అలాగే పాలకులు, కార్యాశీలురు మరియు ప్రజా సేవాపారయణులు అయితేనే మంచి పనులు జరుగుతాయి. ప్రజలు మెచ్చే మంచి పనులు చేసేందుకు పాలకుడి ఉత్సాహం, పట్టుదల, నిబద్ధత, ప్రయత్నం ఉంటే చాలు.. తండ్రి వెంట బిడ్డల్లా జనం పాలకుడితో కదిలి వస్తారు. అడగకుండానే స్నేహహస్తం అందిస్తారు అని స్వామి వివేకానంద సూక్తులను ఆర్థిక మంత్రి గుర్తుచేశారు.

కష్టాల్లో ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు సాయం చేయనప్పుడు వారి ముఖాల్లో చిరునవ్వు వెలిగించనప్పుడు వారి జీవితాలకు కొత్త వెలుగు ప్రసాదించనప్పుడు అభివృద్ధికి అర్థమే లేదు

మాట ఇచ్చేముందు ఆలోచిస్తాను ఇచ్చాక ఆలోచించేది ఏముంది ముందుకు వెళ్లాల్సిందే అన్ని దివంగత మహానేత వైఎస్సార్ చెప్పిన సూత్రాన్ని మన ప్రభుత్వం పాటించుకుంటూ వెళుతుంది.

ఎవరైనా తాము చేపట్టాలనుకుంటున్న మార్పుని సాధించడానికి అంకితమైతే ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించి విజయం సాధిస్తారు.

మానవభివృద్ధి సూచికల ప్రకారం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానంలో నిలపడం కన్నా మించిన కర్తవ్యం మన ప్రభుత్వానికి మరొకటి లేదు.

కరోనా మహమ్మారిపై పోరాటంలో ముందున్నాం

కరోనా విపత్తు పరిస్థితుల్లోనూ ఆర్థిక వ్యవస్థ కుంటుపడకుండా చూశాం

కరోనా సంక్షోభం సమయంలోనూ సంక్షేమంపై వెనకడుగు వేయలేదు

రైతులకు సాయం చేయడం ద్వారా ప్రాథమిక రంగానికి ఊతం

గత ప్రభుత్వం చెప్పిన రెండంకెల వృద్ధి బూటకం

పేద ప్రజల కష్టాలను తీర్చడానికి నవరత్నాలను అమలు చేస్తున్నాం.

పేద ప్రజల కష్టాలను తీర్చడానికి నవరత్నాలను అమలు చేస్తున్నాం.

'అన్నిరకాల సంపదల్లో పేదలకు భాగం కల్పించినవాడే నిజమైన నాయకుడు' అంటూ బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆర్థిక మంత్రి

అచ్చమైన తెలుగు కవితతో అసెంబ్లీలో ప్రసంగాన్ని ప్రారంభించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న మంత్రి బుగ్గన

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం పెట్టిన చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

## కరోనాను దీటుగా ఎదుర్కొంటున్నాం

కార్యకలాపాలు క్రమంగా పుంజుకుంటున్నాయని అన్నారు. మార్కెటింగ్ విధానంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో రైతుల ఆదాయం మెరుగుపడటమే కాకుండా వారి ఉత్పత్తులను గిట్టబాటు ధరలకు విక్రయించేలా తోడ్పడుతుందని చెప్పారు. స్థానిక ఉత్పత్తులను గుర్తించి, అక్కడే ప్రాసెస్ చేసి దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు ఉందని అన్నారు. ఈ సమావేశంలో పంజాబ్, కేరళ, గోవా, ఉత్తరాఖండ్, జార?ండ్ సహా పలు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. లాక్‌డౌన్‌ను సడలించి రెండు వారాలు గడిచిపోయాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై సలహాలు, సూచనలు అందిస్తే భవిష్యత్తు ప్రణాళికలకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ సమావేశం అవడం ఇది ఆరోసారి.

## భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తత

చైనాతో పేచీపై దేశ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ కూడా స్పందించారు. గాల్వన్ వ్యాలీలో తరుచూ చైనా ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని, ఇలాంటి ఘటనలను ఎదురునిలబడి ఎదుర్కోవాల్సిన సందర్భం వచ్చిందన్నారు. సరిహద్దుల వద్ద రోజూ సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, కేంద్ర ప్రభుత్వం దీని పట్ల కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గాల్వన్ ఘటనతో సరిహద్దు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు అని కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. డీ ఎస్కలేషన్ ప్రక్రియ సమయంలో భారత ఆర్మీ కల్నల్, జవాన్లు చైనా చంపేసిందంటే పరిస్థితి ఎంత ఉద్రిక్తంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు.

## అసెంబ్లీకి నల్లచొక్కాలతో తెదేపా నేతలు

కనీసం 15రోజుల పాటు అన్ని జాగ్రత్తలు తీసుకుని అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనం దోచుకునేందుకే సంక్షేమం పేరుతో నాటకాలు ఆడుతున్నారని నేతలు దుయ్యబట్టారు. సభలో మాట్లాడే అవకాశం వచ్చినా రాకపోయినా సమస్యల పరిష్కారం కోసం తమవంతుపోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. మరో ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ... తెదేపా ప్రజాప్రతినిధుల నోరు నొక్కేందుకే కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. పెళ్లికి హాజరైన యనమల రామకృష్ణుడు, తనపై అన్యాయంగా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

## పార్టీలు మారడం ఆయన నైజం

ఎంపీ రఘురామకృష్ణంరాజును ప్రశించారు. ఈ రోజు ఎంపీగా గెలిచి సొంత పార్టీపై విమర్శలు చేయడం సరికాదన్నారు.

ప్రజల్లో ఆయనకు అంతపేరు ప్రఖ్యాతలు ఉంటే.. ఆయనే సొంతపార్టీ పెట్టుకుని పోటీ చేయాలన్నారు. పార్టీని కాకుండా తనను చూసే ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని చెప్పుకుంటున్న రఘురామకృష్ణంరాజుకు, నరసాపురం పార్లమెంటు పరిధిలో అసెంబ్లీ అభ్యర్థులు కంటే ఎందుకు తక్కువగా ఓట్లు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర మాజీ మంత్రి చిదంబరాన్ని అరెస్ట్ చేసిన రోజు గోడ ఎందుకు దూకారో మోదీకి చెప్పాలన్నారు. తామంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టంతోనే గెలిచామని మంత్రి పేర్కొన్నారు. తమది టీడీపీ, బీజేపీ లాంటి పార్టీ కాదని, రఘురామకృష్ణంరాజు పప్పులు ఇక్కడ ఉడకవని మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు.

కులాల మధ్య చిచ్చుపెడుతున్నారు : మంత్రి శ్రీరంగనాథరాజు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారని మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. క్షత్రియ సామాజిక వర్గానికి కూడా కేబినెట్‌లో చోటు కల్పించారని ప్రశంసించారు. ఎంపీ రఘురామకృషంరాజు కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మంత్రి మండిపడ్డారు.

## విశాఖనే పరిపాలన రాజధాని

రాజధానిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే వెనుకబడిన రాయలసీమకు పూర్వవైభవం తీసుకువచ్చేలా, కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేసి న్యాయ రాజధానిగా గుర్తించాలని సంకల్పించింది. ప్రభుత్వ నిర్ణయానికి ప్రతిపక్ష టీడీపీ నిత్యం అభ్యంతరం వ్యక్తం చూస్తూ కోర్టులో కేసులు వేస్తున్నా, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా మూడు రాజధానులకే ముఖ్యమంత్రి జగన్ కట్టుబడి ఉన్నారు. ఈ మేరకు సంబంధిత బిల్లుకు రాష్ట్ర శాసనసభ సైతం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. పారిశ్రామిక రంగంలో 5శాతం వృద్ధిరేటు నమోదు అయ్యిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ (2020-21) సమావేశాలు సందర్భంగా గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. తొలిసారి ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగం చేశారు.

**ఆరోగ్యశ్రీ కింద 6.25 లక్షల మందికి లబ్ధి**

రాజ్‌భవన్ నుంచి గవర్నర్ బిశ్వభూషన్ ప్రసంగిస్తూ.. 'ఎన్నికల హామీలో ఇవ్వని 40 పథకాలను సైతం విజయవంతగా అమలు చేస్తున్నారు. ఈ ఏడాదిలో వివిధ పథకాల కింద 3.98 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందారు. దీని కోసం రూ.42వేల కోట్లు ఖర్చు చేశాం. గత ఏడాదితో పోలిస్తే తలసరి ఆదాయం 12శాతం వృద్ధి సాధించాం. 129 హామీల్లో 77 హామీలు నెరవేర్చారు. 39 హామీలు పరిశీలనలో ఉన్నాయి. మేనిఫెస్టోలో లేని 40 హామీలను కూడా నెరవేర్చడం జరిగింది. పిల్లల చదువు, తల్లుల సంక్షేమం కోసం అమ్మఒడి పథకాన్ని ప్రారంభించాం. నాడు-నేడు మనబడి కార్యక్రమం కింద.. మూడేళ్లలో 48వేల పాఠశాలలను ఆధునికీకరిస్తాం. ఆరోగ్యశ్రీ పథకం కింద 6.25 లక్షల మందికి లబ్ధి చేకూరింది. దీని కోసం రూ.1534 కోట్లు ఖర్చు చేశాం. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్నాం. దీనికోసం 1105 కోట్లు ఖర్చు చేశాం.

**12వేల వైఎస్ఆర్ క్లినిక్‌లు**

జగనన్న వసతి దీవెన కింద 18.51 లక్షల మందికి లబ్ధి చేకూరింది. దీనికోసం 3857 కోట్లు ఖర్చు చేశాం. వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద 1.06 లక్షల మంది పొందారు. దీని కోసం రూ.72.82 కోట్లు ఖర్చు చేశాం. వైఎస్ఆర్ కంటివెలుగు కింద 67.69 లక్షల మందికి లబ్ధి.. దీని కోసం 53.85 కోట్లు ఖర్చు పెట్టాం. గ్రామ సచివాలయాల్లో 12వేల వైఎస్ఆర్ క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు.. ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రజా ఆరోగ్యంలో భాగంగా 1060 కొత్త 108, 104 వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. నాడు-నేడు కింద ఆస్పత్రులను ఆధునీకరించేందుకు రూ.15337 కోట్లు కేటాయించాం. వైఎస్ఆర్ రైతు భరోసా పథకం మొదటి దశ పూర్తయింది, రూ.12500 ఇస్తామని చెప్పినప్పటికీ.. దీన్ని రూ.13500లకు పెంచాం. మొదటి దశలో 49.44 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుస్తూ.. రూ.10,209.32 కోట్లు ఖర్చు చేశాం.

**30 లక్షల మందికి ఇళ్లపట్టాలు**

కౌలు రైతులకు కూడా ప్రయోజనం కల్పిస్తూ చర్యలు చేపట్టాం. ప్రతి గ్రామ సచివాలయంలోనూ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి నియోజకవర్గస్థాయిలో 147 వైఎస్ఆర్ వ్యవసాయ ప్రయోగశాలలను ఏర్పాటు చేశాం. జిల్లాస్థాయిలో 13 ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేశాం. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, కరువు పరిస్థితులను అధిగమించేందుకు రూ.2వేల కోట్లతో విపత్తు సహాయ నిధికి రూపకల్పన చేశాం. రూ.7వేల కోట్లతో 30 లక్షల మందికి ఇళ్లపట్టాలు అందిస్తున్నాం. మహిళల పేరిట ఈ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయిస్తాం. నాలుగేళ్లలో 25 లక్షల గృహాలను సమకూరుస్తాం. 15 లక్షల ఇళ్లకు సంబంధించి ఆగస్టులో పనులు ప్రారంభమవుతాయి.

**36,810 మందికి ఉద్యోగ అవకాశాలు**

జలయజ్ఞం కార్యక్రమం ద్వారా ఉద్దేశించిన 54 సాగునీటి ప్రాజెక్ట్‌ల్లో14 ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశాం. మిగిలిన ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ ఏడాది పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్, సంగం బ్యారేజీ నెల్లూరు బ్యారేజీ, వంశధార రెండోదశ, వంశధార-నాగావళి అనుసంధానం అవుకు రెండో సొరంగం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తాం. విద్యుత్ బకాయిలకు సంబంధించి డిస్కంలకు రూ. 17904 కోట్లు కేటాయించాం. ఏపీఐఐసీ ద్వారా 1466పైగా కంపెనీలకు భూములు కేటాయించాం. దీని ద్వారా 36,810 మందికి ఉద్యోగ అవకాశాలు, రూ.11548 కోట్ల పెట్టుబడులు వస్తాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం వైఎస్ఆర్ నవోదయ పథకాన్ని ప్రారంభించాం. భోగాపురం, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు పనులను వేగవంతం చేశాం. జీఎంఆర్ సంస్థతో రూ.2,300 కోట్ల మేర భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడులో మూడు కొత్త ఓడరేవుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. రూ. 3200 కోట్ల వ్యయంతో మూడేళ్లలో 8 చేపలు పట్టే ఓడరేవులను నిర్మిస్తాం'

**5.5 లక్షల పరీక్షలు పూర్తి**

కోవిడ్ వ్యాప్తిని నిరోధించడానికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంది. కరోనా పరీక్షల నిర్వహణలో ఇతర రాష్ట్రాలకంటే ఏపీ ముందుంది. రోజుకు దాదాపు 15వేల పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 5.5 లక్షల పరీక్షలు పూర్తి చేశాం. రాష్ట్రంలో మరణాల రేటు.. జాతీయ సగటు కంటే చాలా తక్కువగా ఉన్నాయి. రికవరీ రేటు.. జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వం టెస్టింగ్ ల్యాబ్‌లను 1 నుంచి 13కు పెంచింది. రాష్ట్రంలో 5 ప్రత్యేక కోవిడ్ ఆస్పత్రులున్నాయి. కరోనా నివారణకు జిల్లాల్లో 65 ఆస్పత్రులు. 5,400 ఐసీయూ బెడ్స్, 38వేల ఐసోలేషన్ బెడ్స్ ఆక్సిజన్ సరఫరాతో 15వేల బెడ్స్ ఉన్నాయి' అని పేర్కొన్నారు.

## భౌతిక దూరం పాటిస్తూ అమ్మవారిని దర్శించుకోండి

### ఇసుకతోట శ్రీశ్రీశ్రీ కనకమాంబ సన్నిధిలో వైసీపీ నగర అధ్యక్షులు వంశీకృష్ణశ్రీనివాస్



మద్దిలపాలెం : శ్రీశ్రీశ్రీ కనక దుర్గమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం సంధర్భంగా విశాఖ వైసీపీ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఈరోజు అమ్మవారి పూజా కార్యక్రమం లో పాల్గొని తీర్ధ ప్రసాధములు స్వీకరించారు. అమ్మవారి పండుగ ను శ్రీకృష్ణా యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కరోనా ని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, బౌతిక దూరం పాటిస్తూ ఘనంగా ఏర్పాట్లు చేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడు తూ అమ్మవారి కరుణ, దయ అందరిపై ఉండాలని త్వరలో కరోనాను అధిగమించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం లానే అమ్మవారి మహోత్సవం లో పాల్గొనే అవకాశం కల్పించిన గ్రామ కమిటీకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాష్ట్ర వైసీపీ అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు అధ్యక్షుడు గోలగాని అప్పారావు, అధ్యక్షుడు పల్లా త్రినాధ్, ఉపాధ్యక్షుడు బొట్ట గణేష్, ఒమ్మి నాయుడు, రాజు , ప్రసాదుల అప్పారావు , ముప్వల శ్రీను , కృష్ణంనాయుడు , వినోద్ మరియు కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## విజినిగిరి భాలభానుమూర్తికి యూత్ ఐకాన్ మరియు కరోనా వారియర్ అవార్డు



సింహాచలం : 98 వ వార్డ్ పరిది సింహాచలం విజినిగిరి పాలెం కు చెందిన విజినిగిరి. బాలభానుమూర్తికి ఒకే సంస్థ నుంచి రెండు ఇంటర్నేషనల్ అవార్డులు దక్కించుకున్నారు. సమాజంలో అవినీతి నిర్మూలించేందుకు కృషిచేస్తున్న వరల్డ్ అగైనెస్ట్ కరప్షన్ పీపుల్ కౌన్సిల్ సంస్థ వారు సోషల్ వర్కర్ విజినిగిరి. బాలభాను మూర్తికి తను గత ఎనిమిది సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ యూత్ ఐకాన్ అవార్డుతో పాటు ఇంటర్నేషనల్ కోవిడ్ 19 వారియర్ అవార్డును మహారాష్ట్ర రాష్ట్రం పూణేలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్.విజయ్ డి.బజాజ్, డాక్టర్.జ్యోతి వి.బజాజ్ సంయుక్తంగా ఎంపిక చేసి లాక్ డౌన్ కారణంగా జూన్ 16న ఆన్ లైన్ లో సర్టిఫికేట్స్ ను అందజేశారు.

ఈ సందర్భంగా బాలభానుమూర్తి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న సంస్థ ద్వారా రెండు ఇంటర్నేషనల్ అవార్డులు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## 19న ధర్నాను జయప్రదం చేయండి



పాడేరు : జిఒ 3 రిజర్వేషన్ పునరుద్ధరణకు, సమగ్ర చట్టం కోసం అసెంబ్లీలో చర్చించాలని, గిరిజన సలహా మండలిలో తీర్మానం చేయాలని, ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరుతూ ఈనెల 19న ఉమ్మడి రాష్ట్రాల ఐటిడిఎల వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని జిఒ 3 సాధన కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. పాడేరులోని గిరిజన సంఘం కార్యాలయంలో జిల్లా ప్రతినిధులతో 9న నిర్వహించిన బంద్‌పై సమీక్షించారు. ఈ బంద్‌తో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ఇచ్చిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. ప్రకటనలకు పరిమితం కాకుండా తక్షణమే ఆచరణ దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో జిఒ సాధన కమిటీ నాయకులు జె.దేముడు, కెవి.రమణ, కె.కాంతారావు, కె.నీలకంఠం, కె.బాలన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు చేర్చేందుకు కృషి : జేసీ

విశాఖపట్నం : 'రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నవరత్నాల అమలుపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాం. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందించేందుకు కేంద్రీ కరిస్తాం. సంక్షేమ పథకాల అమల్లో అర్హులెవరూ తప్పోకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. శాఖల వారీగా సమీక్షలు చేపట్టి, అమలు తీరును పరిశీలిస్తున్నాం.' అని జిల్లా జాయింట్ కలెక్టర్ (ఆసరా-సంక్షేమం) ఆర్.గోవిందరావు అన్నారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత శాఖల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడిన విషయాలు ఆయన మాటల్లోనే... ప్రభుత్వం వివిధ తరగతుల కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. పథకాలు అర్హులైన ప్రజలకు అందించడానికి కృషి చేస్తున్నాం. సమన్వయంతో వ్యవహరించి పథకాలు అమల్లో మంచి ఫలితాలు సాధించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పటికే కొన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేశాను. వివిధ ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన వారికి జాబ్ కార్డులు మంజూరు చేయనున్నాం. ఉపాధి హామీ పనులు చేయడానికి ముందుకొచ్చే పేదలకు జాబ్‌కార్డులు మంజూరుకు తొలి ప్రాధాన్యత ఇస్తాం. జిల్లాకు వచ్చిన వలస కూలీల వివరాలు సేకరిస్తున్నాం. దరఖాస్తు చేసుకున్నవారందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పనులు కల్పిస్తాం. ఈ ఏడాది ఉపాధి పథకం కింద నిర్ధేశిత పని దినాలు అమలుకు కృషి చేస్తాం.బిసి, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగుల్ వంటి శాఖల్లో అమలవుతున్న పథకాలుసమర్థవం తంగా అమలుకు కృషి చేస్తాను.

## సింహాద్రినాధుని సింహగిరి గిరిప్రదిక్షిణ రద్దు




సింహాచలం: శ్రీ సింహాద్రి నాధుని కి ప్రతీయేడు నిర్వహించే ముఖ్యమైన ఉత్సవాల లో వకటైన సింహగిరి ప్రదిక్షిణ ప్రతీయేడు ఆషాఢ పౌర్ణమి నాడు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగటం ఈ ఉత్సవం లో సుమారు 5 లక్షల మంది భక్తులు హాజరై ప్రదిక్షణలో పాల్గొని అనంతరం అప్పన్న ను దర్శించుకుంటారు కాని ఈ యేడుకరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ ఉత్సవాన్ని రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈ ఓ డీ బ్రమరాంబా తెలియజేశారు.

ఈ ఉత్సవం సందర్భంగా లక్షల మంది పాల్గొని స్వామి దర్శనానికి వస్తారు కనుక వైరస్ భారీగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని కనుక రద్దు చేస్తున్నట్టు మరియు సింహగిరి పై ఆలయం చుట్టూ ప్రదిక్షన కూడా భక్తులను అనుమతించమని కనుక భక్తులు ఎవ్వరూ రావద్దని కోరారు అంతే కాకుండా చివర విడత చందన సమర్పణ యదావిదిగా జరుగుతుందని అధికారులు తెలియజేశారు.

## పైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవములో పాల్గొన్న కె.కె.రాజు



సీతమ్మధార : 25వార్డు సీతంపేట కనకమ్మవారి వీదిలో, (మూడుగుడులు)శ్రీ శ్రీ శ్రీ పైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవములో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ అమ్మవారి చల్లని దయతో అందరూ బాగుం డాలని కరోనా వ్యాధి వ్యాప్తి నేపధ్యంలో అందరూ సామాజిక దూరం పాటిస్తూ తగు ముందు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో 25వార్డు అభ్యర్థి సారిపల్లి గోవింద్, నార అమ్మాజీ, నూకరాజు, బి.శ్రీను, యస్.గంగరాజు, బి.రమేష్, యన్.వెంకట్, యస్.సురేష్, బి.సంతోష్, ఈ.వాసు, కొండబాబు, యస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక హెూమములు



సింహాచలం: శ్రీ సింహాద్రి నాధుని ఆలయంలో లోక కల్యా ణం కాంక్షిస్తూ ప్రత్యేక హెూమ ములు మంగళవారం నాడు శాస్త్రోక్తంగా జరిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనవ్యాధి ప్రబల కుండా ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని సత్సం కల్పంతో జరిపారు. ఉదయం 7 గంటల నుండి స్వామివారి ఆలయంలో ద్వాద శాక్షరీ జపం సుదర్శన నరసింహ హెూమము మరియు మహాశాంతి హెూమం నిర్వహించగా ఈ కార్యక్రమం ఆలయ స్థానచర్యులు టీ పి రాజగోపాల్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నిర్వహించగా ఈ హెూమ ములు లో ఆలయఈఓ డీ.బ్రమరాంబ ట్రస్ట్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 61వ వార్డులో బీజేపి 2.0 కరపత్రాలు పంపిణీ



ములగాడ: కేంద్రంలో రెండోసారి బీజేపి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు, సాధించిన విజయాలు ,బడుగుబలహీన వర్గాల వారికోసం 160 రకాల సంక్షేమ పథకాలను "జనజాగరణ" పేరుతో బీజేపి 2.కరపత్రాలను పంపిణీ చేసారు. బీజేపి 61వ వార్డ్ అధ్యక్షుడు పంచదార్ల అప్పలరాజు ఆధ్వర్యంలో వార్డులోని ప్రకాశనగర్, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పంచదార్ల అప్పలరాజు మాట్లాడుతూ బీ.జే.పి కేంద్రంలో 2వ సారి అదికారంలోకి వచ్చాక ప్రదాని నరేంద్ర మోదీ ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, రామ జన్మభూమి, వంటి వందల యేళ్ల సమస్యలను పరిష్కరిస్తూ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న గొప్పనాయకుడని కొనియాడారు. కరోనా మహమ్మారి బారిన పడకుండా సరైన సమయంలో లాక్ డౌన్ విదించి 130 కోట్ల దేశ ప్రజల ప్రాణాలను కాపాడి ప్రపంచ నేతగా మోదీ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. గతంలో టి.డి.పి ఇప్పుడు వై.సి.పి కేంద్రప్రభుత్వం ఇచ్చిన సొమ్మును మరియు రాష్ట్ర ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వకార్యాలయాలకు తమ పార్టీ రంగులు వేసుకునే పనిలో పడ్డారని, ప్రజా సంక్షేమం గాలికొదిలేసారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీ బీ.జే.పి యేనని, రానున్న రోజుల్లో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తమ పార్టీకే పట్టం కడతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కరోనా కారణంగా ఇబ్బందిపడుచున్న దేశప్రజలను ఆదుకోవడం కోసం " ఆత్మ నిర్బర భారత్ " పేరుతో 20 లక్షల కోట్ల బారీ ఉద్దీపన ప్యాకేజ ప్రకటించి, సూక్ష్మ , చిన్న, మద్యతరగతి పరిశ్రమలకు , వ్యవసాయ రంగానికి పెద్ద యెత్తున నిదులు కేటాయించి, అన్ని రంగాల వారిని ఆదుకున్నారని అన్నారు. కేంద్ర సంక్షేమ పతకాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నెట్ల శ్రీరామచంద్ర, ఎన్. తరుణ్ కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల ఆరో విడత ఉచిత పంపిణీ



విశాఖపట్నం : నిత్యావసర వస్తువుల ఆరో విడత ఉచిత పంపిణీ ఈనెల 18 వ తేదీ నుంచి 26వ తేదీ వరకు చేస్తారని జాయింట్ కలెక్టర్ - 1 ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు ఆయన స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ప్రతి రేషన్ కార్డు పై ఒక కిలో శనగలు, మనిషికి 5 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తారని, అలాగే రూ.10 కి అరకిలో పంచదార ఇస్తారని తెలిపారు. రేషన్ షాప్ దగ్గర రద్దీని నివారించడానికి కార్డు దారుడు రావలసిన తేదీ, సమయం వివరాలతో కూపన్ ఇస్తారని తెలిపారు. నవశకం సర్వే తర్వాత జిల్లాలో 11,74,568 కుటుంబాలను అర్హులుగా గుర్తించి బియ్యం కార్డులను తయారు చేయడమైనదని, అందులో ఇంకా 1,96,000 కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కార్డులను మూడు రోజుల లోగా పంపిణీ చేయాలని తెలిపారు.

బియ్యం కార్డులకు సంబంధించి కొత్త కార్డులు, కుటుంబ సభ్యుల మార్పు చేర్పులపై 6000 దరఖాస్తులు వచ్చాయని, వాటిని దరఖాస్తు చేసిన పది రోజులలోగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.ఒ రూరల్ ఆర్. శివ ప్రసాద్, సివిల్ సప్లై కార్పొరేషన్ డి ఎం వెంకటరమణ, ఏ ఎస్ ఓ లు, డి టి లు పాల్గొన్నారు.

## నగర పరిధిలో కరోనా నిషేధిత జాబితా నుండి తొలగించిన ప్రాంతాలు




విశాఖపట్నం : జివిఎంసి పరిధిలో కరోనా వ్యాధి గ్రస్తులును గుర్తించిన తరువాత ఆయా ప్రాంతాలను కంటైన్మెంట్ జోన్ లుగా జిల్లా యంత్రాగము ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల్లో వ్యయాధి ప్రబల కుండా వివిధ చర్యలు అధికారులు చేపడు తున్నారు. కొన్ని నిషేదిత (కంటైన్మెంట్) ప్రాంతాలలో కరోనా వ్యాధి ప్రబలకుండా 28 రోజులు పైబడి సాధారణ పరిస్థితులు ఏర్పడుట వలన జిల్లా యంత్రాగము ఆయా ప్రాంతాలను బఫర్ జోన్లతో కలుపుకొని కంటైన్మెంట్ ప్రాంతాల జాబితా నుండి తొలగిస్తూ "డీ-నోటి పై" ఉత్తర్వులు జారీ చేసియున్నారు.

తొలగించిన "డీ-నోటిపై" ప్రాంతాలు: 1). మాధవధార, 2). గోపాలపట్నం, 3). మర్రిపాలెం, 4). శ్రీ నగర్, 5). కె.ఆర్.ఎం. కాలనీ, 6). పిఠాపురం కాలనీ, 7). సింహాద్రిపురం, 8). వడ్లపూడి, 9). నాయుడుతోట, 10). అప్పన్న పాలెం (వేపగుంట), 11). ప్రియ దర్శిని కాలనీ (గాజువాక), 12). జగన్నాధపురం (అక్కయ్యపాలెం), 13). రైల్వే న్యూకాలనీ, 14). ఎస్.వి.పి. నగర్ (కొబ్బరి తోట).

పైన తెలిపిన ప్రాంతాలు డీ-నోటిపై చేసిన తరువాత, ఇంకా నగరంలో 45 కంటైన్మెంట్ ప్రాంతాలు బఫర్ జోన్లతో కలుపుకొని జి.వి.ఎం.సి పరిధిలో ప్రస్తుతం అమలులో ఉన్నాయని జి.వి.ఎం.సి. ప్రధాన వైద్య ఆరోగ్య శాఖాధిఖారి డా. కె.ఎల్.ఎస్.జి. శాస్త్రి తెలిపారు.

## పరిసరాల శుభ్రతతోనే సీజన్ వ్యాధులు దూరం...



కంచరపాలెం, పరిశరాల శుభ్రత తోనే సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండొచ్చని జీవీఎంసీ జోన్ -4 ఎ .ఎం. ఓ. హెచ్ ఏ .రాజేష్ పెర్కొన్నారు. ఈమేరకు జీవీఎంసీ 53 వ వార్డు పరిది మర్రిపాలెం, జ్యోతి నగర్ జీవీఎంసీ వార్డు కార్యలయం వద్ద మంగళవారం ఉదయం సీజన్ వ్యాధుల నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తూ స్థానిక ప్రజలకు అవగహన కల్పించారు.

పరిశరాలు శుభ్రంగా లేకపోవడం వలన దోమలు వ్యాప్తి చెందుతాయని తద్వరా మలేరియా, డెంగ్యూ భారిన పడే ఆవకాశం వుందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా నివారించాలంటే ఎప్పటికప్పు పరిశరాలు శుభ్ర పరచుకోవడంతోనే సాధ్యమన్నారు . కార్యక్రమంలో బాగంగా కరపత్రాలను అందజేసారు . కార్యక్రమంలో మలేరియా ఇన్స్ పెక్టర్ సుధాకర్,శానిటేషన్ సెక్రెటరీస్, పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### వ్యూహాత్మక ప్రగతి

ఆశయ సాధన కోసం లక్ష్య సాధకులు ఎల్లవేళలా కార్యోన్ముఖంగా ఉంటారు. అనుకూల పరిస్థితుల కోసం ఎదురుచూడకుండా అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదలకుండా కృషిచేస్తారు. సరిగ్గా ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అదే చేస్తున్నది. కరోనా కష్టకాలంలో కూడా తెలంగాణ సర్కార్ పారిశ్రామిక ప్రగతి కోసం 'ప్లగ్ అండ్ ప్లే' విధానంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది. చైనా నుంచి తరలిపోతున్న పరిశ్రమలను తెలంగాణ రాష్ట్రానికి ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వనరులు, వసతుల కల్పనకు విశేష కృషిచేస్తున్నది. టీఎస్ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు సానుకూల వాతావరణాన్ని సృష్టించింది. ఇప్పటికే దీనిద్వారా 12వేల పరిశ్రమలు వచ్చాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోబీ)లో అగ్రస్థానం దక్కించుకున్న తెలంగాణ, ప్రస్తుత విధానంతో పారిశ్రామికాభివృద్ధిలో దూసుకు పోతుందనటంలో సందేహం లేదు.

ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, వైద్యం, ఐటీ, ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఏరోస్పేస్ రంగాల కంపెనీల స్థాపనకు రాష్ట్రం అనుకూలం. వీటికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు, మానవ వనరులు, భౌగోళిక వాతావరణ పరిస్థితులు, ఈవోడీబీ లాంటి అనుకూల అంశాలు ఇప్పుడు కీలకంగా మారనున్నాయి. భూమి లభ్యత, మానవ వనరులు, రవాణా తదితర సౌకర్యాలను దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటులో వికేంద్రీకరణను పాటించింది. అభివృద్ధి అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం కాకుండా పలు జిల్లాల్లో పరిశ్రమల స్థాపనకు పూనుకున్నది. ఐటీ ఉత్పత్తులు, ఎగుమతుల్లో దేశంలోనే తెలంగాణ ప్రధాన భూమిక పోషిస్తున్నది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలను స్థాపించి వెంటనే వాణిజ్య ఉత్పత్తులు ప్రారంభించే అవకాశమున్న 21 పారిశ్రామిక పార్కులను పరిశ్రమల శాఖ గుర్తించింది. ఈ క్రమంలోనే ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్‌ను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవటం గమనార్హం.

రాష్ట్ర సమగ్ర, సంతులిత అభివృద్ధిలో వ్యవసాయానికి తోడు పారిశ్రామిక ప్రగతి కూడా ముఖ్యమైనది. సాగునీటి ప్రాజెక్టులతో వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది. నియంత్రిత సాగు విధానంతో వ్యవసాయాన్ని అన్ని రకాల సమస్యల వలయం నుంచి విముక్తి దిశగా తీసుకుపోతున్నది. దీనికి తోడుగా పారిశ్రామిక ప్రగతి కూడా అత్యావశ్యకం. వివిధ రకాల కంపెనీల స్థాపన, పెట్టుబడులు తరలి రావటంలో కేంద్ర ప్రభుత్వ అనుమతులు, సహ కారం అవసరం. ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌ను మంజూరు చేయాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరింది. వీటిపై కేంద్రం సానుకూలంగా స్పందించి 'కాస్ట్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, క్వాలిటీ ఆఫ్ డూయింగ్ బిజినెస్'పై దృష్టి సారించిన రాష్ట్రానికి చేయూతనందించాలి. రాష్ట్రాభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉన్నదనేది నిర్వివాదం. సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలు సాధిస్తున్న పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రం అండగా నిలువాలి.

## తాజా చేపల కోసం కరోనా భారీన పడవద్దు

### - జిల్లా కలెక్టర్



శ్రీకాకుళం : తాజా చేపల కోసం కరోనా భారీన పడవద్దని జిల్లా కలెక్టర్ జె నివాస్ పిలుపునిచ్చారు. జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి వారు స్వీయ రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు మంగళ వారం తాజాగా ఒక సందేశాన్ని కలెక్టర్ నివాస్ విడుదల చేస్తూ జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. జిల్లాలో 384 కరోనా కేసులు ఉన్నాయని వాటిలో 271 ఏక్టివ్ కేసులు ఉన్నాయని తెలిపారు. శ్రీకాకుళం నగరంలో 10 కేసుల వరకు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ, ముంబాయి, గుజరాత్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుండి రైలు, విమానం తదితర మార్గాల గుండా జిల్లాకు అనేక మంది వచ్చారని తెలిపారు. బయట నుండి వచ్చిన వారు దగ్గర బంధువులైనా, ప్రాణ స్నేహితులైనా కలవవద్దని హితవు పలికారు. బయట నుండి వచ్చిన వ్యక్తుల కలిసిన వ్యక్తులతోపాటు వారి కుటుంబాలకు, సమాజానికి కూడా కరోనా సోకే అవకాశాలు ఉన్నాయని గ్రహించాలని పేర్కొన్నారు. జిల్లాకు వచ్చే వారికి చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, హామ్ క్వారంటీన్ లో ఉంటామని అంగీకార పత్రం ఇచ్చిన వ్యక్తులను హెూమ్ క్వారంటీన్ కు పంపిస్తున్నామని అయితే సరిగా హెూమ్ క్వారంటీన్ పాటించక చాలా మందిని ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టడం జరుగుతుందని కలెక్టర్ విచారం వ్యక్తం చేసారు. సారవకోట మండలంలో ఒక వ్యక్తి హెూమ్ క్వారంటీన్ నిబంధనలు ఉల్లంఘించినందుకు క్రిమినల్ కేసు నమోదు చేసామని ఆయన స్పష్టం చేసారు. హెూమ్ క్వారంటీన్ లో ఉంటామని బయటకు తిరగడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. సమాజాన్ని ప్రమాదంలో పెడుతున్నామనే భావన ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. నమ్మకంతో హెూమ్ క్వారంటీన్ కు పంపిస్తున్నామని, 14 రోజులు విధిగా బయటకు రాకుండా హెూమ్ క్వారంటీన్ పాటించాలని కోరారు.

కరోనా తగ్గిందని ఉత్సాహపడుతున్నారా ?

సాధారణ ప్రజానీకం రోడ్లపై అధికంగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇలా ఇష్టానుసారం తిరగడం హానికరమని పేర్కొన్నారు. లాక్ డౌన్ సడలింపులు ఇవ్వడంతో కరోనా తగ్గిందని ఉత్సాహపడుతున్నట్లు ఉన్నారని, ఇప్పుడే చాలా అప్రమత్తంగా ఉండాల్సిన సమయమని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో రోజుకు 30 నుండి 50 కేసులు వస్తున్నాయని గుర్తించాలని చెప్పారు. ప్రజలు ఇష్టానుసారం తిరిగి కేసులు ఎక్కువ అవుతుండటంతో తమిళనాడులో జూన్ 19 నుండి 30వ తేదీ వరకు లాక్ డౌన్ అమలు చేయనున్నారని, విజయవాడలో 40 వార్డులలో లాక్ డౌన్ పాటిస్తున్నారని పేర్కొంటూ కేసులు పెరిగితే కఠిన లాక్ డౌన్ కు వెళ్ళవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో మాదిరిగా ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే తమ పనులు చూసుకుని ఇంటివద్ద ఉండాలని ఆయన సూచించారు.

## వైభవంగా ఆదిత్యుని కళ్యాణం



అరసవల్లి : శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో ఘనంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. జేష్ఠ బహుళ ఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ గారు తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటలకి కల్యాణం ప్రాంభించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది.

## యువతకు మరింతగా విద్యావకాశాలు

విజయనగరం : జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఉన్నత విద్యా సంస్థలతో జిల్లా యువతకు రానున్న రోజుల్లో మరింతగా విద్యావకాశాలు పెరుగుతాయని కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్ అన్నారు. వచ్చే ఏడాదిలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల, కురుపాంలో ఏర్పడబోయే గిరిజన ఇంజినీరింగ్ కళాశాల, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, గరివిడిలో ఏర్పాటవుతున్న పశువైద్య కళాశాలలతో విద్యా కేంద్రంగా రూపొందనున్నదని పేర్కొన్నారు. టెలీ స్పందన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పూర్తి చేయాల్సిన పనులపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.

సుందర నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దనున్నామని పేర్కొంటూ నగరంలో చేపట్టే పార్కులు, చెరువుల అభివద్ధిలో జిల్లా అధికారులు కుడా భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

## బడ్జెట్‌పై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి : పవన్ కల్యాణ్



అమరావతి: రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోకుండా... ప్రజలను ఆకర్షించడానికి మాత్రమే వైకాపా ప్రభుత్వం బడ్జెట్ రూపొందించినట్లుగా ఉందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విమర్శించారు. ఈ బడ్జెట్ అంతా ఓ పెద్ద కనికట్టు అని పవన్ అన్నారు. "వ్యవసాయం, ఇరిగేషన్, గృహనిర్మాణాల, వైద్య ఆరోగ్యం లాంటి కీలక శాఖల బడ్జెట్‌లో కోతలు విధించారు. దీనిప్కై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలి" అని పవన్ డిమాండ్ చేశారు. "రాష్ట్రానికి ఆదాయ మార్గాలను పెంచకుండా ఎంతోకాలం సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించలేరు. గత ఆర్థిక సంవత్సరం (2019-20) బడ్జెట్‌ను రూ.2.27లక్షల కోట్ల అంచనాలతో రూపొందించారు. కానీ సవరించిన అంచనాలతో ఖర్చు చేసినది రూ.1.74 లక్షల కోట్ల మాత్రమే. వాస్తవ బడ్జెట్ అంచనాలకు సవరణలకు తేడా రూ.53,217.54 కోట్లుగా ఉంది" అని పవన్ వివరించారు. కొత్త బడ్జెట్ చూసిన తరువాత జనసేన నేతలు, పార్టీకి సేవలు అందిస్తున్న మేధావులు కొన్ని సందేహాలను వ్యక్తం చేశారని పవన్ చెప్పారు.

## గ్లాస్‌డోర్ కొట్టుకుని మహిళ మృతి

ఎర్నాకుళం: కేరళలో ఓ మహిళ గ్లాస్‌డోర్ కొట్టుకొని చనిపోయింది. ఎర్నాకుళం జిల్లాలోని పెరంబూర్‌లో ఓ బ్యాంకుకు బీనా పాల్ అనే 40 ఏళ్ల మహిళ వెళ్లింది. బ్యాంక్ పని చూసు కుంటుండగా కారులో మర్చిపోయిన ఓ పేపర్‌ను తిరిగి తెచ్చు కునేందుకు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించింది. అక్కడున్న గ్లాస్‌డోర్ మూసి ఉందన్న విషయం ఆమె గమనించలేక పోయింది. హడావిడిగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించి గ్లాస్‌డోర్‌ను ఠపీమని కొట్టుకుంది. దీంతో ఆ గ్లాస్‌డోర్ పగిలి పోయింది. వెంటనే కింద కూర్చుంటుండగా గ్లాస్ ముక్కలు ఆమె కడుపులోకి దిగబడ్డాయి. ఇది గమనించిన బ్యాంకులోని సిబ్బంది ఆమెను లేవదీసి కుర్చిలో కూర్చొపెట్టి రక్తం కారుతున్న కడుపుకు ఓ గుడ్డ కట్టి దగ్గర్లోని హాస్పిటల్‌కు పంపించారు. కానీ ప్రయోజనం లేకపోయింది. ఆమె హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## సమయం

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం ఆవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : జ్యేష్ఠ ; తిథి : ఏకాదశి ఉ.6.37; అశ్విని ఉ.6.01; సా.వ.4.34ల 6.19.

బుధవారం 17-06-2020

**మేషం** :శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్తం ధనం బాగా ఖర్చు చేస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు. **మిధునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిరచరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ముల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదురవుతుంది. **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి. **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభ మవుతాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యాదూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది. **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది. **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది. **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకుతనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవుతారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. **మీనం** :దైవ పుణ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన పనులు మీరే చేసుకోవడం మంచిది. రాజకీయాల్లోని వారికి శత్రువులు అధికమవుతున్నారని గమనించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

## విశ్వసిస్తేనే భగవద్దర్శనం

## సంకీర్తన



భగవంతుడు సాధు రక్షణార్థం, ధర్మ సంస్థాపనార్థం ఏ రూపంలోనైనా గోచరించగలడు. అదే భగవంతుని అవతార విశిష్టత. ఆయనను సంపూర్ణంగా విశ్వసించకపోతే బాధపడక తప్పదు. విశ్వసిస్తే ఆత్మగత సంబంధం ఏర్పడుతుంది. దేవుడి శక్తి మనలో నిండి ఉంటుంది. కనుక అప్పుడు ఎవరిలోనైనా దైవత్వం కనపడుతుంది. ఇలాంటి భావం అందరిలో ఏర్పడకపోవడానికి కారణం, దేవుడు లేడని కాదు మనకు దేవుడు కనపడాలన్న కోరిక బలంగా లేకపోవడం. కోరికలు మహారాజును కూడా కటిక పేదవాడిగా మార్చ గలవు. కనుక భక్తులు కోరికలకు దూరంగా భగవంతుడికి దగ్గరగా ఉండేందుకు ప్రయత్నించాలి.

మనకు అవసరమైనవన్నీ భగవంతుడే అడక్కుండా సమకూరుస్తాడు.

మనం కోరుకున్న కోరికలలో ఏవైనా తీర లేదంటే అవి మనకు మేలు చేయనివని దేవునికి అని పించి ఉండాలి. అందుకే పరమాత్మ మనకు అను గ్రహించలేదని తెలుసుకోవాలి. ఈనాడు భగవంతుని గురించి వినడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు.

అయినా వారిలోని అశాంతిని పారదోలుకోలేకుండా వున్నారు. ఎన్నో ఉపదేశాలు వింటున్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు వ్యక్తిగతంగా, సామాజిక పరంగా చేస్తున్నారు.

అయినా వారిలో శాంతి లేదు. వినడమొక్కటే సరిపోదు. భక్తితో భగవంతుడిని సేవించి నప్పుడే బ్రతుకు పునీతమవుతుంది. మనఃపూర్వకంగా భగ వంతుణ్ణి ధ్యానించే వారికి అసంతృఎప్తి అనేది వుండదు.

తన గురించి మనకెంత తెలుసునని ఆయన ఆలో చించడు, ఆయనకోసం మనమెంత తపిస్తున్నా మనేదే ఆయన వీక్షణ. దేవుడు మన భక్తి విషయంలో సదా మేల్కొనేట్టుగా మన పూజలు వుండాలి. అంతేగానీ ఉన్నాడో లేడోనని పదిమందిని పోగేసి మీమాంసలు చేయవద్దు.

సంశయాత్ములకు భగవంతుడు సందేహాస్పదుడే! దైవ కార్యాలకు వచ్చే విఘ్నాలను దైవమే పోగొట్టాలి.

తన శక్తి పైన గాక పరమాత్మ శక్తి పైన ఆధారపడి జీవించే వాడు భక్తుడు. మూడవ నేత్రం ముక్కంటికే గాదు, మనుష్యులందరికీ ఉంది. అదే జ్ఞాన నేత్రం. ఎవరికి జ్ఞాననేత్రం తెరుచుకుంటుందో వారు గర్వాన్ని దగ్ధం చెయ్యగలరు.

సర్వం జ్ఞాన ప్లవే నైవ వృజినం సంతరిష్యసి జ్ఞానమనే తెప్పచే పాపరాశిని దాటగలవని శ్రీకృష్ణుడు గీతలో బోధించాడు.

భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసం వుంచిన వాడికి జగమంతా వెలుగులే!

# దారమఠం శివాలయం వద్ద పార్కుకు శంకుస్థాపన



పార్కుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

గొలుగొండ : మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ దారమఠం శివాలయం వద్ద మంజూరైన ఎన్ఆర్ఇజిఇఎస్ 4 లక్షలు నిధులతో నూతన పార్కుకు పాతమల్లంపేట పంచాయతీ మాజీ సర్పంచ్, మండల వైసిపి నాయకులు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ చొరవతో మరిన్ని నిధులు మంజూరు చేసి పంచాయతీకి మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. అలాగే దారమఠం ఒక పుణ్యక్షేత్రమే కాక పర్యాటకులను ఎంతగానో ఆకర్షించే ప్రదేశమని ఈ ప్రదేశాన్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో దారమఠం దేవస్థానం చైర్మన్ వాడపల్లి అప్పారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుప్రియ, ఈసి రాధిక, ఫీల్డ్ అసిస్టెంట్ రాయపురెడ్డి విజయ, దేవస్థానం బోర్డు సభ్యులు, వైసీపీ నాయకులు తూబె జోగులు, కెల్లా రమణబాబు, కొత్తపాలెం వైయస్సార్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇన్సూరెన్సును పునరుద్ధరించండి

## - పలువురు జర్నలిస్టులకు ఆర్థికసాయం



విశాఖపట్నం : కరోనా విపత్తులో తమ ప్రాణాలను సైతం ఎదురొడ్డి విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాలని, తక్షణమే పెండింగ్‌లో వున్న ఇన్సూరెన్సులను పునరుద్ధరించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు కోరారు.

అనారోగ్యం బారిన పడి, మరికొందరు ప్రమాదాలకు గురై వేరు వేరు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని మంగళవారం శ్రీనుబాబు పరామర్శించారు. ఇక్కడ ఆరిలోవ క్యూ1 ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీడియో జర్నలిస్టు వై.వి. నాయుడును పరామర్శించి ఆయనకు వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ తరపున ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇటీవలే నాయుడుకు ప్రమాదం జరిగి చేయి విరగడంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. మరో జర్నలిస్టు కేర్‌లోనూ, ఇంకో ముగ్గురు జర్నలిస్టులు ఇళ్ల వద్ద వైద్యసదుపాయాలు పొందుతున్నారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్సును పునరుద్దరించాలన్నారు. మరోవైపు ప్రమాద భీమా పాలసీ కూడా కొనసాగించాలన్నారు. ఈ రెండు లేక పోవడం వల్ల పలువురు జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో పాటు కరోనా విపత్తును దృష్టిలో వుంచుకొని సమాజం కోసం పాడుపడుతున్న జర్నలిస్టులకు 50 లక్షల ఇన్సూరెన్సు సదుపాయం వర్తింపజేయాలని కోరారు. ఈ విషయమై ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులకు లేఖలు వ్రాయడం జరిగిందన్నారు.

నిరంతరం సమాజం కోసం పాటుపడుతున్న జర్న లిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా వి.జె.ఎఫ్. పాటుపడుతుందన్నారు.

# అధికారులకు అక్రమ చేపల చెరువులు పట్టవా..!

## - సీపీఎం నాయకులు ఆవేదన



దేవరాపల్లి : మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వందలాది ఎకారాల్లో అక్రమ చేపలు చెరువులు పెంపకం జరుగుతున్న అధికారులు చౌద్యం చూస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న ఆరోపించారు. కలిగోట్లలో వలెంటర్ల సహాయంతో వ్యర్థ పదార్థాలు పట్టుకున్నారు. సోమవారం సిపిఎం నాయకులు మండలంలోని కలిగోట్ల, తారువ, పెదనందిపల్లి, కొత్తపెంట చేపలు చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... రైతులకు డబ్బులు అశ చూపించి బీమవరం, కృష్ణ, అమలాపురం, ప్రాంతాల నుంచి వలస వచ్చిన పెంపకందార్లు చేపల చెరువులల్లో పశుమాంసం, చికెన్ వ్యర్థ పదార్దాలు వేసిన, రైవాడ ఇరిగేషన్ నీరును చెరువులకు మళ్లించిన అధికారులు పట్టనట్టు వ్యవహరించిన తీరుపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే వ్యర్థ పదార్థాలు నిషేధించకపోతే మండలం ప్రజలు తో పాటు చేపలు తిన్న వారు ఆనారోగ్యం పాలు అవ్వటం ఖాయమన్న సిపిఎం నాయకులు హెచ్చరించారు.

# దేవరాపల్లి - విశాఖకు మూడు ఆర్టీసీ బస్సులు



దేవరాపల్లి : ఎట్టకేలకు విశాఖపట్నం నుంచి దేవరాపల్లి కు ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయి. మద్దిలపాలెం డిపో ద్వారా మూడు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ అరుణకుమారి స్థానిక విలేకర్లుకు తెలిపారు. తొలి విడతగా మూడు బస్సులు నడుపుతున్న డిఎం కు, ఆర్టీసీ సిబ్బంది కు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరావు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# పదవతరగతి పరీక్షలు రద్దుచేయాలి

***భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంటా నూకరాజు***

భీమునిపట్నం : కరోనా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా రాష్ట్రంలో జరగవలసి ఉన్న పదవతరగతి పరీక్షలను రద్దు చేయడం ఉత్తమమని భీమిలి డివిజన్ టీడీపి అధ్యక్షుడు గంటా నూకరాజు సూచన ప్రాయంగా తెలియజేశారు. మొదటి లాక్ డౌన్ నుండి పరిశీలిస్తే నెలనెలా కరోనా కేసులు తీవ్రరూపం దాల్చడం, ప్రస్తుతం వర్షాకాలం కావడం వలన పదవ తరగతి పరీక్షలు రద్దుచేసి విద్యార్థులకు తరువాత తరగతికి వెళ్ళడానికి గ్రేడింగ్ ప్రాతి పదికన అందర్నీ ఉత్తేర్ణులు చేస్తే బాగుం టుందని గంటా నూకరాజు అన్నారు. రాష్ట్రంలో ఉండే ప్రధాన నగరాలు అయిన విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూల్ లో అంతకంతకు కేసులు పెరుగుతున్న దృష్ట్యా పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచించాలని అన్నారు. లక్షల్లో ఉన్న పధవతరగతి విద్యార్థిని, విద్యార్థులను దృష్టిలో పెట్టుకోవాలని, వీళ్ళందరూ 15 సంవత్సరాలలోపు పిల్లలు కావడం వలన రద్దుచేస్తే బాగుంటుందని, విద్యార్థులకు సంవత్సరం వృధా కాకుండా అందరినీ వారియొక్క గ్రేడింగ్ అనుసరించి ఉత్తీర్ణుల్ని చేసినట్లయితే ఇంటర్మీడియట్ చదవడానికి ఎటువంటి ఇబ్బంది ఉండకపోవచ్చు అని గంటా నూకరాజు అన్నారు. పక్కన ఉన్న తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో పరీక్షలను రద్దుచేసిన విషయాన్ని గమనించాలని తెలియజేశారు.



**నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా భారతీయ జనతా పార్టీ రెండవ సారి అధికారం చేపట్టిన తర్వాత ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సంవత్సర కాలంలో తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మక ఘటనలపై అవగాహన కలిగించేందుకు జనజాగరణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విశాఖ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర పాల్గొని కరపత్రాన్ని అందజేశారు.**

## పంచాయితీ షాపులు బహిరంగ వేలం వాయిదా

పరవాడ : మండల కేంద్రమైన పరవాడలో నేడు జరుగబోయే 2020-2021 సంవత్సరమును గానూ 9పంచాయితీ షాపుల బహిరంగవేళమును వాయిదా వేస్తున్నామని పంచాయితీ కార్యదర్శి జి.అచ్యుతరావు మంగళవారము ఒక ప్రకటనలో తెలిపారు.

తదుపరి బహిరంగ వేళముతేథినీ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

# జివిఎంసి జోన్ -3 కార్యాలయం వద్ద సీపీఎం నిరసన



విశాఖపట్నం : సిపిఎం పార్టీ ఆలిండియా కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిరసనలో భాగంగా సిపిఎం జగదాంబ జోన్‌లో ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు వై.రాజు అధ్యక్షతన జోన్-3 కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమానుద్దేశించి సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుదేశాలలో మాత్రమే కరోనా నియంత్రణ వుందని అన్నారు. భారతదేశంలో కేరళ రాష్ట్రం కరోనాను కట్టడి చేసిందని అన్నారు. కాని బిజెపి ప్రభుత్వం కరోనాను అరికట్టడంలో పూర్తి వైఫల్యం చెందింది. కరోనా పేరుతో కేంద్రం ప్రకటించిన రూ. 20లక్షల కోట్లు ఎవరికి ఇచ్చారని అన్నారు. వందలాది మంది వలస కార్మికులు చనిపోయారని ఆయన తెలిపారు. స్వదేశీ నినాదం పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, ప్రైవేట్ బడాపెట్టుబడ ి దారులకు కారుచౌకగా అమ్ముతున్నది. లాక్‌డౌన్ సమయంలో కార్మిక చట్టాలను సవరించి యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రతి కుటుంబానికి రూ.10000/- చెల్లించాలని, ఉపాధిలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని, కేరళ తరహాలో 17 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ఆదుకోవాలని, నిరుద్యోగబృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, చంద్రమౌళి, వై.రాజు, చంద్రశేఖర్, పి.ఎ.వి నాయుడు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వం అరాచకాలను అరికట్టాలి

## తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన టీడీపీ అధ్యక్షుడు గంటా నూకరాజు



భీమునిపట్నం : టీడీపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం భీమిలి డివిజన్ టీడీపి అధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో భీమిలి తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ పార్టీ నాయకులు,మహిళలు, బి.సి,ఎస్సీ, మైనారిటీ లపై దౌర్జన్యాలు ఎక్కువయిపోయాయని అన్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల మీద ప్రతీకారం తీర్చుకునే విధంగా పాలన చేస్తున్నారే తప్ప, ప్రజా సంక్షేమం కోసం ఆలోచించడం లేదని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న ముఖ్య నాయకులు మీద కేసులు పెట్టడం, బెదిరించడం, దౌర్జన్యం చేయడం చేస్తున్నారని, లొంగితే వైసీపీ కండువా కప్పడం లేకపోతే జైల్లో పెట్టడం చేస్తున్నారని అన్నారు. ఈమధ్యకాలంలో కింజరాపు అచ్చెన్నాయుడు అరెస్ట్ గాని, జె.సి.ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, చింతమనేని అరెస్ట్ లు దీనికి నిదర్శమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఈ ఆరాచకాలను అరికట్టాలని తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, కనకల అప్పలనాయుడు,కాసరపు ఎల్లాజి,అప్పికొండ నూకరాజు, ఊళ్ళ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ సంఘసేవకులు కొణతాల శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో...

### ***రోడ్లపై జీవనం సాగించే.. అనాధలకు, ప్రభుత్వ ఘోషా ఆస్పత్రుల్లోని గర్భిణీలకు, బాలింతలకు..ఆహారం పంపిణీ***

నిరుపేదల ఆకలి తీర్చడం కోసం.. - 87 రోజులుగా..నిర్విరామంగా.. వివేకానంద సంస్థ సేవా కార్యక్రమాలు..
పేదల కడుపు నింపేందుకు... దాతలు ముందుకు రావాలి :అధ్యక్షుడు సూరాడ అప్పారావు



విశాఖపట్నం : ప్రముఖ సంఘసేవకులు కొణతాల శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో... రోడ్లపై జీవనం సాగించే అనాధలకు, ప్రభుత్వ ఘోషా ఆస్పత్రిలో ఉన్న.. గర్భిణీలకు, బాలింతలకు, వారి సహాయకులకు.. శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆహార ప్యాకెట్లు అందజేసింది..నిరుపేదల కడుపు నింపేందుకు.. మనసున్న దాతలు ముందుకు రావాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు విజ్ఞప్తి చేశారు. లాక్‌డౌన్ కారణంగా ఏ ఒక్క నిరుపేద ఆకలితో ఉండకూడదని ఆశయంతో... 87 రోజులుగా నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రతీరోజు గర్భిణీలకు, శిశువుల తల్లులకు, మరియు వారి సహాయకులకు, కూరగాయలు అమ్మే రైతులకు, ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే పారిశుధ్య సిబ్బందికి, ప్రజాసేవలో రాత్రి పగలు కష్టపడుతున్న పోలీసులకు, జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న క్యాబ్ డ్రైవర్లకు, చేపలు అమ్ముకుని జీవనం సాగించే మత్స్యకార మహిళలకు, రోడ్లపై జీవనం సాగించే అనాధలకు ఉదయం అల్పాహారం, రాగి జావ, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్నామని తెలియజేశారు. మనసున్న మారాజులు ముందుకు వచ్చి చేయూత అందిస్తే.. మరింత ఎక్కువ ఆహార ప్యాకెట్లు పంపిణీ తోపాటు.. స్థానికంగా ఉన్న ప్రతీ నిరుపేదల ఇంటికే వెళ్లి.. బియ్యం బస్తాలు, కందిపప్పు, పంచదార, నూనె ప్యాకెట్లు, పాల ప్యాకెట్, సబ్బులు రొట్టెలు, పాల ప్యాకెట్లు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు.

# బీజేపీ సంక్షేమ పథకాలపై కరపత్రాల ఆవిష్కరణ



కొయ్యూరు : భారతీయ జనతా పార్టీ మోడీ 2.0 ప్రభుత్వం మొదటి సంవత్సరం సందర్భంగా మంగళవారం కొయ్యూరులో మోడీ ప్రభుత్వం 2.0 రెండవ విడత పాలనలో మొదటి ఏడాది చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అరకు జిల్లా అధ్యక్షులు కురసా ఉమా, కొయ్యూరు మండల అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, కూడా నూకరాజు, మురుకుర్తి సతీష్, కొర్రు నూకరాజు, జి.దేముడు, శరభయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

# వైకాపా అరాచకాలపై ఆర్డీఓ, తహశీల్ధారులకు వినతి



కాకినాడ : రాష్ట్రంలో రోజురోజుకీ వైఎస్సార్‌సీపీ గూండాలు చెలరేగి పోతున్నారని, సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రామచంద్రపురం నియోజకవర్గ తెదేపా నాయకులు దూడల శ్రీనివాసరావు అన్నారు.రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడులు,అక్రమ అరెస్టులకు నిరసనగా 2రోజుల పాటు రామచంద్రపురం నియోజక వర్గంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రామచంద్రపురం నియోజక వర్గ నాయకులు దూడల శ్రీనివాసరావు, రామచంద్రపురం తెదేపా జెడ్పీటీసీ అభ్యర్థి దూడల నాగభూషణం ఆధ్వర్యంలో రామచంద్రపురం ఆర్డీఓ గణేష్ కుమార్‌కు, రామచంద్రపురం తాహశీల్దారు పి.తేజేశ్వరరావుకు తెదేపా రామచంద్రపురం శ్రేణులు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజక వర్గ తెదేపా నాయకులు దూడల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సరైన సమయంలో తెదేపా నాయకులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.జగన్ పాలన చూసి ప్రజలు, చీత్కరించుకుంటున్నారన్నారు. తెదేపా సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలపై కేసులు బనాయిస్తూ వైకాపా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు.ప్రజలకు అవసరమైన ఇసుక, ఇళ్ళ స్థలాలు పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.ఈ వ్యవహరాన్ని ప్రజల్లో ఎండగడతారనే ఉద్దేశ్యంతో ప్రతిపక్ష నేతలపై కక్ష సాధిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని, వైకాపా ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోనికి తీసుకొని వెళతామని ఆయన అన్నారు. రామంచంద్రాపురం రూరల్ తెదేపా జెడ్పీటీసీఅభ్యర్థి దూడల నాగభూషణం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని ఏదో విధంగా ఇరుకున పెట్టాలని ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా తెదేపా నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వాటికి తెదేపా భయపడే ప్రసక్తే లేదని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాకోర్టులో ఎండగడతామని నాగభూషణం హెచ్చరించారు. రెండు రోజుల పాటు రామచంద్రపురం నియోజక వర్గంలో నిర్వహించిన నిరసనకార్యక్రమాల్లో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గ్రంధి వెంకట రాజు, పార్టీ నేతలు బత్తుల శ్రీనివాస్, ఖండవల్లి విజయరాజు,యండమూరి చంద్రశేఖర్, దిల్, సురేష్, డాక్టర్ శేషగిరిరావు, దుర్గారావ్, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం

### సెక్షన్ విద్యుత్ శాఖ ఏఇ శేషసాయి

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ ప్రాంత విద్యుత్ వినియోగదారులకు నేడు పరవాడ 220 కెవి సబ్‌స్టేషన్ విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటినెన్స్ కొరకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరవాడ సబ్ స్టేషన్ పరిధి , వాడచీపురుపల్లి సబ్ స్టేషన్ పరిధి మరియు తానం గ్రామం తదితర ప్రాంతాల్లో ఉదయం నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందనీ పరవాడసెక్షన్ విద్యుత్ శాఖ ఏఈ శేషసాయి తెలిపారు.

## కోవిడ్-19పై భారతదశం చేస్తున్న పోరాటానికి డీపీసీఎల్ మరియు సంస్థ యొక్క సీఎస్ఆర్ విభాగం ఈశాన్య ఫౌండేషన్ మద్దతు

శ్రీకాకుళం : కోవిడ్-19 పై పోరాటానికి ప్రముఖ రసాయనాలు, ఎరువుల ఉత్పత్తి దారులైన దీపక్ ఫెర్టిలైజర్స్ అండ్ పెట్రోకెమికల్స్ తమ సీఎస్ఆర్ ఇషాన్యా ఫౌండేషన్ సహకారంతో భారీగా సహాయక చర్యలు ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ డైరక్టర్ సైలేష్ నే మెహతా మాట్లాడుతూ హెల్త్ కేర్ ఉద్యోగుల కోసం 2,500 పిపిఇ కిట్లు, బీఆర్క్ నాలుగు అంబు లెన్సులు, వెయ్యి లీటర్ల ఐసో ప్రొఫిల్ ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్లు, రక్షణ దళాలకు అవసరమైన శానిటైజర్ల తయారీకు ముడిపదార్థం, నాలుగువేల మాస్కులు అందజేశామన్నారు. ఆంధ్రప్రాంతంతో పాటూ మహారాష్ట్ర, ముంబై, పూణే ప్రాంతాలకు కూడా సహాయం చేశామన్నారు. ఈ మేరకు ఆయా ప్రభుత్వాలకు సహాయాన్ని అందజేశామన్నారు. దీంతో పాటూ రూ.38.70 లక్షల ఆర్థిక సాయం, మొబైల్ క్లినిక్ ద్వారా 9058 మందికి, నలభై గ్రామాలలో 3073 మంది రోగులకు చికిత్స అందించామని తెలిపారు.

## నేడు, రేపు మన్యం బంద్‌కు మద్దతు



లోకుల గాంధీ

కొయ్యూరు : ఈ నెల 17,18 తేదీలో రెండు రోజుల పాటు జరిగే మన్యం బంద్‌కు పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకుల గాంధి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెంబరు 3 విషయంపై మన్యం జేఏసీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి, గవర్నర్, రాష్ట్రపతికి జిఒ 3పై లేఖలు రాయడం జరిగిందని, అపార్ట్ మెంట్ కూడా కోరామని ఆయన అన్నారు. కొంత మందికి అవగాహన లేకుండా కేంద్ర ప్రభుత్వం నిందించటం సరికాదని ఆయన తెలిపారు.

## పారిశుధ్య కార్యక్రమంపై కమిషనర్ తనిఖీ



కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ కమిషనరు స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్ ఐ.ఏ.ఎస్, మంగళవారం నగరపాలకసంస్థ పరిధిలో స్థానిక మెయిన్ రోడ్డు పై జరుగుచున్న పారిశుధ్య కార్యక్రమంను పరిశీలించుచూ ఉండగా గోల్డ్ మార్కెట్ ప్రాంతంలో అధిక సంఖ్యలో వ్యక్తులు గుమిగూడి టీ సేవించటం గమనించి సదరు టీ దుకాణమును మూయించివేసినారు. అదే విధంగా మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలులోకి సదరు త్రాగిన కప్పులు పార వేయుట వంటివి చేయుచున్నందున దుకాణ దారులను మందలించుట జరిగినది. ప్రభుత్వం వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు లో భాగం అయిన నాడు- నేడు పథకంలో భాగంగా సోమవారం సాయంత్రం ఆకస్మికంగా నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలు అయిన పరదేశమ్మపేట, గాంధీనగర్, సాలిపేట ఉన్నత పాఠశాలల్లో జరుగుచున్న కార్యక్రమాలు తనిఖీలు చేశారు.త్వరితగతిన అన్ని పాఠ శాలల్లో ఈ కార్యక్రమాలు పూర్తి చేయాలని పిల్లలకు అనువైన, పరిశుభ్రమైన మరియు మౌలిక పరమైన వసతులు అన్నీ సమకూర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించినారు. ఈ పర్యటనలో కమిషనర్ వారితో పాటు సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యనారాయణ రాజు, ప్రజారోగ్య విభాగాధికారి పి.ప్రశాంత్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సత్యదేవుని సన్నిధిలో ఆరోగ్య భారత యజ్ఞయాగం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషన్ వారి ఉత్తర్వుల మేరకు "ఆరోగ్య భారతయజ్ఞ" శ్రీ స్వామివారి దేవ స్థానము నందు లోకకళ్యాణార్థం రాష్ట్రం అంతా సస్యశ్యామలంగా ఉండు నిమిత్తం మరియు సర్వరోగ నివారణార్థం మంగళవారం ఈ యాగం నిర్వహించారు.

# ప్రతి కుటుంబానికి ఉపాధి భృతి కల్పించాలి



దేవరాపల్లి : ప్రతి కుటుంబానికి ఉపాధి భృతి కింద 7500 రూ.చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న డిమాండ్ చేశారు. అదే విధంగా కరెంట్ చార్జీలు తగ్గించాలని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రవేటీ కరణను నిలుపుదల చేయాలని, డిమాండ్ చేస్తు సిపిఎం, ప్రజా సంఘాల అద్వర్యంలో మండలంలోని తెనుగబూడి, రైవాడ, వెంకరాజు పురం, వాకపల్లి, శ్రీరాంపురం గ్రామాల్లో మంగళవారం ఆందోళనలు నిర్వహించారు. అనంతరం దేవరాపల్లి తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి సిహెచ్ రాజు మాట్లాడుతూ కరోనా వైరస్ వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటె కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వ పెట్రోలు చార్జీలు పెంచుకుంటా పోతుందని విమర్శలు చేశారు. ఇటువంటి సందర్భంలో సందిట్లో సడిమియా లాగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం జరుగుతుందని ఆరోపించారు. కరోనాను కట్టడి చేయలెక చేతులు ఎత్తెసిన ప్రభుత్వలు ప్రజలు ఆరోగ్య సమస్యలు గాలికి వదిలేసిందని తెలిపారు. వెంటనే ప్రతికుటుంబానికి 16 రకాలు నిత్యావసర వస్తువులు ఇవ్వాలని ప్రతి ఉపాధి కూలి కి 600 రూ. కూలి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కోకోవాటానికి 7500 రూపాయలు అర్థిక సాయం చేయాలని, పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులను చెల్లిం చాలి, ప్రతి కూలికి ఫేసిప్పులు ఇవ్వాలని, కార్మిక చట్టాలు సవరణను ఆపాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వి.దొంగబాబు తాతబాబు, కె.సన్నిబాబు, ఎన్ .ఎర్రునాయుడు, బాలరాజు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో కేతినేని నరేంద్రమోహన్ సమక్షంలో సమావేశం



విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం కేతినేని సురేంద్ర మోహన్ పత్రిక విలేఖరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం కరోనా వ్యాధి భయంకరంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్షలను జులై 10 వ తేదీ నుండి జరపాలనే నిర్ణయం సరైనది కాదని, ఎందుకంటే మన రాష్ట్రంలో కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్న సమయంలో విద్యార్థులు తల్లిదండ్రులు, తమ పిల్లలను పరీక్షలకు పంపాలంటే ఎంతగానో భయభ్రాంతులకు గురవు తున్నారని తెలిపారు. మన పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో పరీక్షలను రద్దు చేసి అంతర్గత మార్కుల ఆధారంగా వారిని ఉత్తీర్ణులయ్యే విధంగా జీవో విడుదల చేసారని అన్నారు.

అదే విధంగా మన రాష్ట్రంలో కూడా పదవ తరగతి పరీక్షలను రద్దు చేసి విద్యార్థులను వారి అంత ర్గత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులయ్యేలా చేసి, విద్యార్థుల తల్లిదండ్రు లను భయాన్ని దూరం చేసి కరోనా వ్యాప్తిని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ అశోక్, నెమలి విశ్వతేజ, దిలీప్ రాజ్, ఉప్పిలి వంశీయాదవ్, రుద్రరాజు ప్రసాద్ రాజు, ధోని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఒఎన్‌జిసి ప్రోత్సాహం పథకానికి ఆర్థిక సహాయం



కాకినాడ : తూర్పు గోదావరి జిల్లా పరిపాలన యొక్క ప్రోత్సాహం పథకం కొరకు కాకినాడలోని ఒఎన్‌జిసి, హెచ్‌పిహెచ్‌టి అస్సెట్ వారు రూ. 19,42,600/ - చెక్కును అందజేశారు. ఈ మొత్తాన్ని 2019-20 సంవత్సరానికి తూర్పు గోదావరి జిల్లాలోని ముమ్మిడివరం నియోజక వర్గంలోని ప్రాతిభావంతులైన పేద (బిపిఎల్) కుటుంబాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడానికి ఉపయోగించబడుతుంది.

# ప్రతీ కుటుంబానికి 7500లు ఇవ్వాలని నిరసన



అల్లూరి, అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలియజేస్తున్న దృశ్యం

కొయ్యూరు : లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను ఆదుకోవాలని కొయ్యూరు మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యామల అప్పలనాయుడు మాట్లాడుతూ కరోనా వైరస్ సందర్భంగా లాక్‌డౌన్‌లో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ.7500లు ఇవ్వాలన్నారు. ప్రతీ వ్యక్తి నెలకు 10 కేజీల బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రూ.600లు కూలీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు జంపా పెంటయ్య, కె.నాగేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు నేరేడుపండన్న, సత్తిబాబు, బోనంగి గోపాల్ పాల్గొన్నారు.

## విశాఖ ఎంపీ సత్యన్నారాయణ కృషితో రష్యాలో చిక్కుకున్న విద్యార్థినిని రప్పించిన పద్మ

సబ్బవరం : కోవిడ్-19 కారణంలో రష్యాలో చిక్కుకున్న మెడికల్ విద్యార్థినిని విశాఖ ఎంపీ సత్యన్నారాయణనను సబ్బవరం మండల మహిళా నాయకురాలు బి.పద్మ మంగళవారం ఎంపీ సత్యన్నారాయణను కలిసి రష్యాలో చిక్కుకున్న మెడికల్ విద్యార్థినిని ఇండియాకు రప్పించవలసినదిగా ఆమె కోరారు. వెంటనే ఆయన స్పందించి మన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ద్వారా ఇండియాకు మెడికల్ విద్యార్థినిని రప్పించారు. ఎంపీ కృషికి పెందుర్తి నియోజకవర్గ ప్రజలు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేడు రేపు ఏజెన్సీ బంద్?



అరకులోయ : నేడు లోని ఆదివాసి హక్కుల చట్టాలపరిరక్షణ లక్ష్యంగా ఉద్యమాన్నిస్తామని ఆదివాసి జేఏసి రాష్ట్ర చైర్మన్ లియా తెలిపారు గిరిజన హక్కుల చట్టాల పరిరక్షణకు ప్రతి ఆదివాసి భాగస్వామ్యం కావాలని జిఓ నెంబర్3 ను సుప్రీంకోర్టు రద్దుచేయడంతో రాష్ట్రంలోని ఆదివాసి ప్రాంతంలో నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ గిరిజ నోళ్లు కోల్పోయే పరిస్థితి నెల కోవడం బాధ కర మన్నారు దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు రివ్యూ పిటిషన? కలాలు చేయకపోవడం బాధాకరమన్నారు అందుకు నిరసనగా 17 18 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతంలో బందుకు పిలుపు నిస్తున్నారు అని ఆయన తెలిపారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలన



అనంతగిరి : అనంతగిరి మండలం లోని వెంగడ,కాంగుపుట్టు,పైనంపాడు గ్రామాల్లో MGNREGS పనులు సందర్శించడం జరిగింది.

పైనంపాడు లో గతంలో జాబ్ కార్డు హెూల్డర్స్ కు డబ్బులు చెల్లించకుండా చెల్లించినట్లు సంతకాలు తీసుకున్న బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పై ఎమ్.పి.డీ.ఓ కూర్మారావు విచారణ జరిపగా, పెండింగ్ మొత్తము సుమారు రూ.8లక్షలు, 2 నుండి 7 రోజుల్లోచెల్లించడానికి సదరు బి.పి.ఎమ్ పాంగి ఆనందరావు గ్రామ పెద్దలు సమక్షంలో అంగీకరించి ఒప్పందపత్రం రాసి ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏ.పి.ఓ పవన్ కుమార్, మాజీ వైస్-ఎమ్.పి.పి ఎస్.గుండన్న, మాజీ సర్పంచ్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# మాస్క్ తప్పనిసరిగా ధరించాలి

తస్మాత్ జాగ్రత్త : ఎస్సై నాగార్జున



కాకినాడ రూరల్ : ఇంద్రపాలెంలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయిననేపద్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతేనే మాస్క్ ధరించి బయటకు రావాలని ఇంద్రపాలెం ఎస్సై నాగార్జున అన్నారు.

2వ నెం.సచివాలయంలో వాలంటరీగా పని చేస్తున్న మహిళకు పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై విగ్నేశ్వర నగర్ ను రెడ్ జోన్‌గా ప్రకటించారన్నారు. విఘ్నేశ్వర నగర్‌కు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భయాందోళనలు చెందాల్సిన అవసరంలేదని అప్రమత్తంగా వ్యవహరిస్తూ బౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని ఎస్ఐ నాగార్జున రాజు తెలిపారు.

# అర్హులందరకీ రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అనంతగిరి మాజీ ఎంపీటీసీ దీసరి గంగరాజు



అనంతగిరి : మండలం ఎగువశోభ పంచాయతీ సచివాలయ కేంద్రంలో లాక్ డౌన్ కాలంలో ఒక్కోక కుటుంబానికి 7500 రూపాయల ఆర్థిక సాయం 6 నెలల వరకు అందించాలని 200 ఉపాధి హామీ పథకంలో పని దినాలు కల్పించి రోజుకి 600 రూపాయలు ఇవ్వాలని. నిరోద్యగ భ్రుతి కల్పించాలని రేషన్ కార్డులు ఇళ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది ఈకార్యక్రమంలో డి. గంగరాజు జిల్లా కమిటీ సభ్యులు ఎస్. సుబ్బారావు శాఖ కార్యదర్శి. సాగర. రాంబాబు. వైస్ ప్రెసిడెంట్. పి. సన్యాసి రావు మరియు మహిళాలు గిరిజనులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎమ్పీటీసీ దీసరి గంగరాజు



అనంతగిరి : లాక్ డౌన్ సమయం లో ఉపాధి కూలీలందరికీ ప్రభుత్వం 7500 రూపాయలు ఇవ్వాలని ఉపాధి హామీ పనులను 200 రోజులు చేయాలని అనంతగిరి మాజీ ఎంపిటిసి దీసరి గంగరాజు గిరిజనులు మండల తాహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో నందుల మొస్య. రమేష్ సింహాద్రి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కరోనా నిబంధనలు మరింత కఠినం :శివరాజ్ మీనా



యానాం : యానాం అంతర్భాగమైన తూర్పు గోదావరి జిల్లాలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు రోజు రోజుకి వందల సంఖ్యలో పెరగడం వలన నిబంధనలు మరింత కఠిన ముగా అమలు చేస్తున్నట్లు ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా విలేఖర్లకు తెలిపారు. మంగళ వారం ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యానం నియోజవర్గంలో ఉన్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఉద్యోగస్తులకు ఫోటో ఐడెంటి కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. చెక్పోస్టు దగ్గర మరింత కఠినముగా సిబ్బంది చర్యలు చేపట్టే విధంగా ఆదేశించినట్లు తెలిపారు. శానిటైజర్, మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలి అన్నారు. లేనియెడల కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు వందల సంఖ్యలో పెరగడంతో ఈ కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు .ఇతర రాష్ట్రాల నుండి వచ్చే యానం నివాసులను తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వారంటైన్ లో ఎనిమిది రోజులు ఉండాలన్నారు. జిల్లాలోని రామచంద్రపురం, కాకినాడ, అమలాపురం తదితర ప్రాంతాల నుండి వచ్చే వారిని కూడా హోమ్ క్వారంటైన్ లో ఉంచే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత మూడు నెలల్లో యానం నియోజకవర్గంలో ఒక పాజిటివ్ కేసు కూడా నమోదు కాకపోవడంతో సీఎం నారాయణస్వామి అభినందించినట్లు తెలిపారు. అదేవిధంగా రాబోయే మూడు నెలలు కూడా యానం ప్రజల సంక్షేమం కొరకు మరిన్ని కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో 28 ఐసోలేషన్ బెడ్లు, వెంటిలేటర్స్ 2 ఇంకా వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 3213 మందిని క్వారంటైన్ లో వచ్చినట్లు తెలిపారు. ఆరు వందల మందికికి వైరస్ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిపారు. చేసిన పరీక్షలు అన్నియు నెగిటివ్ వచ్చినట్లు తెలిపారు.

# కరోనా పరీక్షకు వ్యక్తి తరలింపు

భీమునిపట్నం : స్థానిక ఎగువపేట కు చెందిన 43 సంవత్సరాల వ్యక్తిని కరోన సోకిందని అనుమానంతో పరీక్ష కోసం విశాఖపట్నం ప్రధమ హాస్పటల్ కి తరలించామని జోనల్ కమిషనర్ సి.హెచ్ గోవిందరావు తెలిపారు.

# బొమ్మూరు లో 1500 బెడ్‌లతో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు

కాకినాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల ప్రకారం జిల్లా యంత్రాంగం బొమ్మూరు లో 1500 బెడ్ లతో కోవిడ్ కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయుచున్నట్లు జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి వెళ్ళడించారు. యానంకు సంబంధించిన వేదాంత లిమిటెడ్ ఇప్పటి వరకు జిల్లాలో కోవిడ్-19 నియంత్రణకు ఎంతగానో సహాయ, సహకారాలు అందించారని ఆయన తెలియజేశారు. జిల్లా యంత్రాంగం అభ్యర్ధన మేరకు వేదాంత, యానం వారు బొమ్మూరులో 1500 బెడ్ ల కోవిడ్ కేర్ కేంద్రం ఏర్పాటుకు 20 లక్షల రూపాయలు నిధులు, సి.ఎస్.ఆర్. ఫండ్స్ నుండి కేటాయించినట్లు ఆయన తెలియజేశారు. ఈ నిధులతో బొమ్మూరులో నెలకొల్పనున్న 1500 బెడ్ ల కోవిడ్ కేర్ సెంటర్ లో కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, వైఫై బ్రాండ్లు, పవర్ సప్లయి, స్టేషనరీ ,ప్లాస్టిక్ ఛైర్లు, నిబులైజర్స్, ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, హైపో క్లోరైడ్ పిచికారి చేసే యంత్రాలు, వ్యర్ధ పదార్ధులు నిల్వ చేసే కవర్లు, ఆక్సిజన్ సిలిండర్లు, వాటర్ ప్రూఫ్ పర్మెనెంట్ టెంట్లు, హ్యాండ్ సేనిటైజర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ల్యాడ్ లైన్ సిస్టం, సెల్ ఫోన్లు, బోర్డుల ఏర్పాటు, అంబులెన్స్, ఆటో ఎనలైజర్, సెల్ కౌంటర్, హ్యాండ్ షీల్డ్, హాట్ వాటర్ గీజర్స్, వాటర్ ప్యూరిఫైయర్స్ తదితర సమాగ్రి కొనుగోళ్ళు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# కరోనా వైరస్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి

: సిఐ గూటం శివగణేష్

యానాం: దేశవ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా వైరస్ వ్యాధి పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సిఐ గూటం శివ గణేష్ అన్నారు. స్థానిక యానం పాత బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో కరోనా వైరస్ పై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సి ఐ గూటం శివ గణేష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కరోణ వైరస్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పనిసరిగా తమ ఆటోలో ప్రయాణిస్తున్నవారి వివరాలను నమోదు చేయా లన్నారు. పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకుని, భౌతిక దూరం పాటిస్తూ మాస్కు, శానిటైజర్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో లో యస్ ఐ ఆల్ఫన్ రాజ్, కానిస్టేబుల్, పివై 04 ఆటో యూనియన్ డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

# నాడు నేడు పనుల వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : జిల్లాలో నాడు- నేడు పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాతపట్నం, పాలకొండ ప్రాంతాల్లో నాడు - నేడు పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పనుల్లో ఎక్కడ జాప్యం ఉండరాదని ఆయన ఆదేశించారు. పనుల నిర్వహణలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ఇసుక కొరత లేకుండా ఆదేశాలు జారీ చేసామని, ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవలని అన్నారు. పాఠశాలలు తెరిచే సమయానికి పాఠశాలల రూపురేఖలు మారాలని పేర్కొన్నారు. పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి మారాలని తెలిపారు. పాఠశాలలో ప్రతి పనికి ఒక ప్రత్యేకత ఉండే విధంగా, చిన్నారులకు ఆహ్లాదం కలిగించే విధంగా ఉండాలని సూచించారు. పాఠశాలలకు మంచి రంగులు వివిధ చిత్రాలతో వేయాలని ఆదేశించారు. పాఠశాల వాతావరణంలో పూర్తి స్థాయిలో మార్పు రావాలని అందుకు గాను పరిసరాలను సైతం ఆహ్లాదంగా తయారు చేయాలని పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలు పెంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. నాడు - నేడు పనుల్లో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటికి వినియోగిస్తున్న సామగ్రిని, ఫ్లోరింగు మెటీరియల్ ను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. నాణ్యతలో లోపాలు ఉండ రాదని, ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని ఆయన స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి టివిఎస్ జి కుమార్, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి పైడి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ లో నిరాటంకంగా ఎరువుల సరఫరా

**కరోనా ప్రభావాన్ని తగ్గించటంలో ఎరువుల పరిశ్రమ సహకారాన్ని అభినందించిన గౌడ**

**కార్మికుల కొరత, యంత్రాల దిగుమతులపై ఆంక్షల సడలింపుపై సానుకూల స్పందన**

న్యూఢిల్లీ : ఈ ఖరీఫ్ సీజన్ లో ఎలాంటి ఆటంకమూ లేకుండా ఎరువుల సరఫరా జరిగేలా చూడాలని కేంద్ర రసాయనాలు. ఎరువుల శాఖామంత్రి డిఇ సదానంద గౌడ ఎరువుల తయారీదారులను కోరారు. ఈ రోజు ఢిల్లీలో ఆయన జరిపిన వీడియో కాన్ఫరెన్స్ లో పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సదానంద గౌడ్ మాట్లాడుతూ, " కరోనా సంక్షోభ ప్రభావాన్ని తగ్గించటంలో ప్రభుత్వానికి సహకరించిన పరిశ్రమ పెద్దలందరికీ ధన్యవాదాలు. ఈ సంక్షోభం, దాని వెనువెంటనే అమలు జరిగిన లాక్ డౌన్ విసిరిన సవాళ్ళు దేశవ్యాప్తంగా ఎరువుల అందుబాటును తీవ్రంగా ప్రభావితం చేసి ఉండేవి. అయితే, అదృష్ట వశాత్తూ అందరూ ఈ విపత్కర కాలంలో తగిన విధంగా స్పందించి ఖరీఫ్ కు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచగలగటం గొప్ప విషయం. ఎన్ని కష్టాలు ఎదురైనా ఎరువుల కర్మాగారాలు పనిచేయటం అభినందనీయం " అన్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది కాబట్టి దేశ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ కార్యకలాపాలు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశముందని కూడా ప్రస్తావించారు. అందువలన ఈ ఏడాది కూడా ఎరువులకు డిమాండ్ గణనీయంగా ఉండే అవకాశముందని అంచనా వేస్తున్నామన్నారు. నిరుటితో పోల్చి చూస్తే యూరియా, పొటాష్, భాస్వరం డిమాండ్ ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఎక్కువగా ఉండటాన్ని గుర్తుచేశారు, ఖరీఫ్ సీజన్ లో 170 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని, అయితే ఉత్పత్తి సుమారు 133 లక్షల మెట్రిక్ టన్నులుంటుందని అంచనా వేశామన్నారు. ఈ తేడాను భర్తీ చేయటానికి దిగుమతులను ఆశ్రయిస్తామన్నారు. ఇప్పటికే గ్లోబల్ టెండర్లు పిలిచామని, ఆ విధంగా రైతులకు కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఎరువుల అందుబాటు సక్రమంగానే ఉన్నట్టు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ విభాగాలు తెలియజేశాయన్నారు. ఈ నెల 9న జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ విషయం వెల్లడైందని చెప్పారు. గడిచిన ఆరేళ్లలో అనుసరించిన సంప్రదాయాన్నే కొనసాగిస్తూ, ఈ సారి కూడా ఎరువుల కొరత ఉండబోదని గట్టిగా నమ్ముతున్నట్టు చెప్పారు. ఎరువుల పరిశ్రమ నిరంతర కృషి వల్లనే ఇది సాధ్యమైందంటూ అభినందించారు. ఎరువుల విభాగం అధికారుల పాత్రను కూడా మంత్రి కొనియాడారు. లాక్ డౌన్ కాలంలో రేయింబవళ్ళు కృషి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలతోను, రైల్వే శాఖతోనూ, హోం మంత్రిత్వశాఖతోనూ సమన్వయం చేసుకోవటం ద్వారా ఎరువుల రవాణాకు, వాటి ముడి సరకుల రవాణాకూ, సిబ్బంది రవాణాకూ ఎలాంటి అంతరాయమూ కలగకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ఎరువుల సబ్సిడీ గురించి మాట్లాడుతూ, పొటాషియం, భాస్వరం ఎరువుల సబ్సిడీని నిర్ధారిస్తూ అవసరమైన అనుమతులు పొందటానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి గౌడ వెల్లడించారు. అలాంటి నిర్ణయాలు తీసుకోకపోతే ఎరువుల తయారీ కూడా తీవ్రంగా ప్రభావితమవుతుందన్న వాస్తవాన్ని గుర్తెరిగి ప్రవర్తిస్తున్నామని చెప్పారు. పెండింగ్ లో ఉన్న సబ్సిడీ బిల్లుల జాప్యం కారణంగా ఎరువుల కంపెనీలు పడుతున్న ఇబ్బందులు తమకు తెలుసునని, ఆర్థిక మంత్రిత్వశాఖతో కలిసి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.వలస కార్మికులు సొంత ఊళ్లకు వెళ్ళిన కారణంగా కార్మికుల కొరత ఏర్పడటం, నిపుణులైన విదేశీ కార్మికులని రప్పించుకోవటం మీద ఉన్న ఆంక్షలు, యంత్ర సామాగ్రి దిగుమతుల మీద ఉన్న ఆంక్షలు కూడ్న్ ఎరువుల పరిశ్రమలు ఎదుర్కొంటున్న కీలకమైన సమస్యలుగా గుర్తించామన్నారు.

వీటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎరువుల కంపెనీల ప్రతినిధులు తమ సమస్యలను ప్రస్తావించగా, మొత్తంగా పరిశ్రమ ఎదుర్కుంటున్న సమస్యలన్నిటినీ పరిష్కరించే దిశలో కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.తీరప్రాంత నౌకారవాణా ద్వారా ఎరువుల తరలింపులోను, నౌకాశ్రయాల్లో ఎరువుల పరిశ్రమలు ఎదుర్కుంటున్న సమస్యలను సహాయ మంత్రి శ్రీ మాన్ సుఖ్ మాండవ్యా చర్చించారు. ఎరువుల విభాగం కార్యదర్శి శ్రీ చబిలేంద్ర రౌల్ అధికారులు ఎరువుల తరలింపు విషయంలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. కోవిడ్ సంక్షోభ కాలంలో రైల్వే మంత్రిత్వశాఖతోను, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర ఏజెన్సీలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నట్టు తెలియజేశారు. ఎఫ్ ఎ ఐ డిజి, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల సిఎండీలు, ఎండీలు, సహకార సంఘాలు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ పనులు కల్పించే విధంగా ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి



కాకినాడ : జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున పనులు గుర్తించి జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ పనులు కల్పించే విధంగా ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించాలని కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలక్టర్ తన కార్యాలయ కోర్టు హాలులో జాయింట్ కలక్టర్ లు జి.లక్ష్మిశ, కీర్తి చేకూరి, జి.రాజకుమారి తో కలిసి క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ కోవిడ్ -19 ప్రభావం వలన ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారు తమ స్వస్థలాలకు చేరుకున్న నేపథ్యంలో అలాంటి వారికి ఉపాధి కల్పించవల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి పనులకు గాను రోజుకు రూ.237/- చెల్లిస్తున్నందునఆ దిశగా గ్రామాలలో పెద్ద ఎత్తున పనులు జరిగే విధంగా ఎంపిడిఓలు పని చేయాలన్నారు. నరేగ లో రోజుకు ఐదు లక్షల మంది పని చేసే విధంగా లక్ష్యాలు ఉన్నందున తదనుగుణంగా జాబ్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఈ పనుల నిర్వహణలో క్షేత్ర స్థాయి సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ఉపాధి పనుల్లో జిల్లా రాష్ట్రం లోనే ప్రధమ స్థానంలోనే ఉందని, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. వెలుగు సంస్థలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు 2 లక్షల 87 వేల మంది నమోదయి ఉన్నారని, వీరందరికీ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు అందించాలని కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి పలు సూచనలు చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్ లో రైతులకు కావలసిన పూర్తి వివరాలు గ్రామాలలో ఏర్పాటు చేసే రైతు భరోసా కేంద్రాల్లో అందే విధంగా పనులు జరగాలన్నారు. మార్చి 31, 2021 నాటికి పూర్తి స్థాయిలో ఈ కేంద్రాలు పని చెసేలా క్షేత్ర స్థాయిఅధికారులు పని చేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిని, మండల స్థాయి అధికారులు ప్రోత్సహించే విధంగా పర్యవేక్షిస్తే గ్రామ పరిపాలనలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. జూలై 8వతేదీన పంపిణీ చేసే ఇళ్ళ పట్టాల కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా గుర్తించిన భూముల్లో రోడ్ల నిర్మాణంతో పాటు హద్దులు తెలిపే రాళ్ళు పాతడం, లబ్దిదారులకు సంబంధించిన లాటరీ పద్ధతిలో నివాస స్థలాలను గుర్తించే విధంగా యంపిడిఓలు, తహశిల్దార్లు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలన్నారు. 20 ఎకరాలకు మించి లేఅవుట్ లో ఆర్చ్ ల నిర్మాణ పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఇంజనీర్లకు కలక్టర్ ఆదేశించారు. కౌలుదార్లకు అందించే సిసిఆర్.సి. కార్డుల జారీ ప్రక్రియను గత సంవత్సరం మాదిరిగా చేపట్టాలన్నారు. కొంత వరకు పూర్తయిన పోలవరం పునరావాస కేంద్రాలకు ముంపు ప్రాంతాల గరిజనులను తరలించే విధంగా ఏజెన్సీ ప్రాంత అధికార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే పూర్తయిన గృహాలకు కావలసిన త్రాగు నీరు విద్యుత్ ఛ్ఛక్తి ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నాడు- నేడు పనులు ఆగస్టు 3వతేదీ న స్కూల్స్ తెలిచే నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆయా శాఖల అధికార్లకు కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలక్టర్(ఆర్) జి.లక్ష్మిశ మాట్లాడుతూ రైతు భరోస, గ్రామ సచివాలయాలు , గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్ వాడీ భవనాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నందున వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆర్.బి.కె., సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు స్థలాల సమస్య లేదని జేసి తెలిపారు. జాయింట్ కలక్టర్ (డి.) కీర్తి చేకూరి మాట్లాడుతూ వార్డు సచివాలయాలు పూర్తి స్థాయిలో పని చేసే విధంగా పట్టణాభివృద్ధి ప్రాంతీయ సంచాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఆగస్టు 12వ తేదీన ప్రారంభించనున్న వై.యస్.ఆర్. చేయూత పథకానికి సంబంధించి అర్హులైన లబ్దిదారులను గుర్తించే విధంగా క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని జేసి ( డబ్ల్యూ) జి.రాజకుమారి అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలక్టర్ డా.అపరాజిత, డిఆర్ఓ సిహెచ్.సత్తిబాబు, జడ్.పి.,సిఇఓ యం.జ్యోతి, బిసి వెల్ఫేర్ డిడి సుబ్బలక్ష్మి, సాంఘిస సంక్షేమ శాఖ జేడి లక్ష్మిదేవి, డిఆర్.డి .ఏ. పిడి హరినాధ్ బాబు, పిడి హౌసింగ్ వీరేశ్వర ప్రసాద్, ఎస్.ఇ. పిఆర్ నాగరాజు, ఎస్.ఇ., ఆర్.డబ్ల్యూ.ఎస్. గాయిత్రి దేవీ, ఎల్.డి.యం. షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలు దరఖాస్తులను సచివాలయాల్లో సమర్పించండి

### జివియంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం :- ప్రజలకు సంబందించిన సేవలు పారదర్శకంగా త్వరితగతిన అందించడానికి పట్టణ పరిధిలో వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసింది. పౌరసేవల దరఖాస్తులు గాని లేదా ఇతర పౌర సంబంద ఫిర్యాదులుగాని ఆయా పరిధిలోగల సచివాలయాలలో అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గావున, నగర పరిధిలో గల ప్రజలు ఎవ్వరైనా ఫిర్యాదులు/ సేవల దరఖాస్తులు చేయదలచిన వారు, సంబందిత వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేయాలని జి.వి.ఎం.సి. కమిషనర్ డా. జి.సృజన ఒక పత్రికా ప్రకటనలో నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**జివియంసి సిబ్బంది విన్నపములు:**

జి.వి.ఎం.సి. సిబ్బంది ఎవరైనా వ్యక్తిగత విన్నపముల దరఖాస్తులు చేయదలచినవారు, కరోనా వ్యాధి నేపథ్యంలో, ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ లో వేయవలసినదిగా కమిషనర్ ఆ ప్రకటనలో జివియంసి సిబ్బందిని కోరారు.

## సీఎంకి రుణపడి ఉంటాం

విజయవాడ: టీటీడీలో సన్నిధి యాదవులకు వంశపారంపర్య హక్కు కల్పించడం హర్షణీయం అని మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని తెలిపారు. చట్టంలో సన్నిధి యాదవులని మార్చినందుకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. 1996లో టీడీపీ ప్రభుత్వం తొలగించిన వంశపారంపర్య విధానాన్ని సీఎం జగన్ అమలు చేశారని.. ఆయన కేబినెట్‌లో మంత్రిగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. సీఎం జగన్ చేసిన మేలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు.

గతంలో సన్నిధి గొల్లలకు ఐదువేలు ఇచ్చేవారని, వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి సమస్యలు తెలుసుకుని 18 వేలు పెంచారని తెలిపారు. టీటీడీలో వంశపారంపర్యం గా హక్కు ఇవ్వడంతో రాష్ట్రంలోని యాదవులంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.

ఇన్నేళ్లు తర్వాత వారికి మంచి చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు.

### ధార్మిక మార్గం.. ధర్మ ప్రచారం

## స్వాత్మానందేంద్ర సన్యాసాశ్రమ జీవితాన్ని ప్రారంభించి నేటికి ఏడాది

**- విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి హోదాలో చురుకైన పాత్ర**



విశాఖపట్నం : జగద్గురు శంకరాచార్య సంప్రదాయ పరంపరలోకి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి అడుగుమోపి ఏడాది పూర్తయింది. సరిగ్గా ఏడాది క్రితం (జూన్ 17న) విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తర పీఠాధిపతిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. సన్యాసాశ్రమ జీవితానికి శ్రీకారం చుట్టారు. బ్రహ్మచర్యాన్ని వీడి...సర్వ సంగ పరిత్యాగిగా మారిన స్వాత్మానందేంద్ర తొలి వసంతంలో ఎన్నో మైలురాళ్లను దాటారు. పూజ్య గురువులు, విశాఖ శారదా పీఠాధిపతులు, శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారి ఆదేశాలతో దిగ్విజయంగా ముందుకు పయనిస్తున్నారు.

తల్లిదండ్రులను, లౌకిక సుఖాలను ప్రక్కన పెట్టి గురువుల ఆదేశాలతో ఏడో ఏటనే విశాఖ శ్రీ శారదాపీఠం పంచన చేరారు. శ్రీ చరణుల సన్నిధిలో సంస్కృతాన్ని అభ్యసించారు. వేదములను ఔపోసన పట్టారు.



## వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



కంచరపాలెం : విశాఖ ఉత్తర నియోజకవర్గం మర్రిపాలెం జంక్షన్ వద్ద 53, 54వార్డులకు సంబంధించిన నాయి బ్రాహ్మణులుకు, రజకులుకు, టైలర్లుకు జగనన్న చేదోడు పథకం ద్వారా 10వేలు వేసినందుకు గాను నాయి బ్రాహ్మణులు, రజకులు, టైలర్లు ఆధ్వర్యంలో జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పాల్గొని పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.యస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయిన మొదటి రోజు నుండి ఈ రోజు వరకు కూడా బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అణగారిన వర్గాల వారి అభ్యున్నతి కోసం పేద ప్రజల యొక్క జీవన ప్రమాణాలు మెరుగుపరచటం కోసం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మన అందరికి తెలిసినవేనని ముఖ్యంగా కరోనా లాంటి మహమ్మరి వ్యాప్తి లాక్‌డౌన్ వల్ల అన్ని వ్యవస్థలు స్తంభించడం వల్ల చేతి వృత్తులు నాయి బ్రాహ్మణులకు, రజకులకు, టైలర్లుకు, జగన్నన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి 10వేలు ఇచ్చినందుకు గాను కృతజ్ఞత భావంతో నాయి బ్రాహ్మణులు, రజకులు, టైలర్లు, వైయస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసారని, ఇన్ని మంచి పనులు చేస్తూ ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతుంటే టీడీపీ నాయకులు నోటికొచ్చిన విధంగా మాట్లాడుతూ వారికి ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసి ఈ రాష్ట్రాన్ని పరిపాలించడలో విఫలం చెంది రాష్ట్ర భవిష్యత్తును చేతగాని తనంతో ప్రశ్నార్ధకం చేసి ఈ రోజు జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తుంటే చూసి ఓర్వలేక ప్రజా సంక్షేమాన్ని చూసి తట్టుకోలేని పరిస్థితిలో టీడీపీ నాయకులు ఉన్నారని టీడీపీ ప్రభుత్వం ఉన్న 5 సంవత్సరాలు కూడా ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకంలో పెద్ద పెద్ద స్కాములు చేసి ప్రజాధనాన్ని అడ్డంగా దోచుకున్నారని ఇప్పటికయినా బుద్ధితెచ్చుకొని ప్రభుత్వం పై విమర్శలు మానుకోకపోతే ప్రజలు మిమ్మలి రోడ్లుపై తిరగనివ్వరని అన్నారు.

ఈ కార్యక్రమంలో 54వార్డు అభ్యర్థి చల్లా రజిని,5 3వార్డు అభ్యర్థి బర్కత్ అలీ, చల్లా ఈశ్వరవు, షేఖ్ బాబ్జి, చిరంజీవి, పెంటరావు, సన్యాసిరావు, నూకరాజు, సూర్య ప్రసాద్, లక్ష్మి, శివ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా భౌమ అశ్విని మహా సౌర హోమం



అరసవిల్లి : శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో భౌమ అశ్విని సందర్భంగా మహా సౌర హోమం, శత రుద్రయ పారాయణ వైభవంగా జరిగాయి. అశ్విని నక్షత్రం తో కూడిన మంగళవారం కావడంతో రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు... దేశం సుభిక్షంగా ఉండాలని కరోనా మహమ్మారి ప్రబలకుండా తగ్గుముఖం పట్టాలని సూర్య దేవాలయంలో ఈ ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించామని ఈఓ వి హరి సూర్య ప్రకాష్ గారు తెలిపారు.

అలాగే ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ మాట్లాడుతూ లోకానికి వెలుగు నిచ్చే, ఆరోగ్యాన్ని ప్రసాదించే దేవుడు అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి ప్రబలకుండా రాష్ట్రం దేశం బయటపడాలని కోరుతున్నట్లు ఆయన చెప్పారు. Covid 19 నిబంధనల ప్రకారం... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు భౌతిక దూరం పాటిస్తూ ఈ కార్యక్రమం సూర్య దేవాలయంలో నిర్వహించబడినది ఈవో తెలిపారు.

### ఎల్జీ పాలిమర్స్ ఘటనపై

## త్వరలోనే తుది నివేదిక

అమరావతి: ఎల్జీ పాలిమర్స్ ఘటనపై సేకరించిన సమాచారం ఆధారంగా తుది నివేదికను త్వరలో సిద్ధం చేయనున్నామని హైపవర్ కమిటీ చైర్మన్ నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కమిటీ ఇప్పటికే సంబంధం ఉన్న అందరి నుండి సలహాలు, సూచనలు ప్రశ్నలు సేకరించడం జరిగిందన్నారు. దానిలో భాగంగా 243 రిప్రజెంటేషన్ 175 టెలిఫోన్, పబ్లిక్, వాట్సాప్ ను రిసీవ్ చేసుకున్నామని పేర్కొన్నారు. దాని ఆధారంగా కమిటీ ఒక ప్రశ్నావళి రూపొందించి ఎల్జీ పాలిమర్స్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ ఇతర రెగ్యులేటరీ అథారిటీ ద్వారా అందించడం జరిగిందని, ఇంకా ఎల్జీ పాలిమర్స్ నుంచి జవాబు అందాల్సి ఉందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను హైపవర్ కమిటీ తుది జాబితాలో పొందుపరుస్తామని ఆయన తెలిపారు. మే నెలలో విశాఖపట్నం సందర్శించిన హైపవర్ కమిటీ స్టేక్ హోల్డర్స్ అందరితో సుదీర్ఘ చర్చలు నిర్వహించిందన్నారు. జూన్ 15న ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు, నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామన్నారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలు ఘటనలపై విస్తృతంగా చర్చించడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వచ్చే వారంలో హైపవర్ కమిటీ మరిన్ని సమావేశాలు రెగ్యులేటరీ అథారిటీతో కలిపి నిర్వహించనుందని ఆయన తెలియజేశారు.

## గిరిజనులకు న్యాయం చేయాలి : ఎమ్మెల్యేలు

తాడేపల్లి: గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన జీవో నెం 3 పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, గిరిజన ఎమ్మెల్యేలతో మంగళవారం సీఎం కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో రాజన్నదొర, కళావతి, భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ,ధన లక్ష్మీలు, బాలరాజు పాల్గొన్నారు. జీవో నెం 3 కి సంబంధించి గిరిజనులకు న్యాయం చేయాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్యేలు వినతి పత్రం అందజేశారు.

### అంతర్జాతీయ విమాన సేవలపై

## త్వరలో స్పష్టత



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కరోనా వైరస్ కేసులు పెరుగుతుండటంతో అంతర్జా తీయ విమాన సర్వీసుల నిలిపివేత కొనసాగుతోంది. లాక్‌డౌన్‌కు భారీ సడలింపులు ప్రకటించిన క్రమం లో అంతర్జాతీయ విమాన రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు సాగిస్తోంది. అంతర్జాతీయ ప్రయాణాలపై నియంత్రణలను ఎత్తివేసే దిశగా వచ్చే నెలలో నిర్ణయం వెలువడుతుందని పౌర విమానయాన మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ మంగళవారం పేర్కొన్నారు. ప్రయాణీకులు, ఎయిర్‌లైన్స్ సహా అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అంతర్జాతీయ విమాన సర్వీసుల పునరుద్ధరణపై ఓ నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

అంతర్జాతీయ విమాన సేవలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయని నిర్దిష్టంగా తాను వెల్లడించలేనని చెప్పారు. కాగా ఎయిర్‌పోర్ట్‌ల్లో విమానాల సంఖ్యపై పరిమితులతో మే 25 నుంచి దేశీయ విమాన సర్వీసులను అనుమతించిన సంగతి తెలిసిందే.

## డా॥ అరబింధో ఫౌండేషన్ పై అసత్య ఆరోపణలు తగవు

- కన్నా,లోకేష్‌వి నిరాధార ఆరోపణలు
- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ



విశాఖపట్నం : సి యస్ ఆర్ నిదులు తో నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న అరబింధో ఫౌండేషన్ పై బీజేపీ అద్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ,టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అసత్య ఆరోపణలు చేయడం తగదని వైసిపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ దుయ్యబట్టారు . మంగళవారం వైసిపీ ప్రధాన కార్యాలయం లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనాలు ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో అందు బాటులో కి తెస్తున్నట్లు తెలిపారు. కన్నా లక్ష్మీ నారా యణ నిరాధార మాటలు మాట్లాడుతూ వున్నారు. ఈ వాహనాలు నిర్వహణ బాద్యత అరబింధో ఫార్మా కంపెనీ కీ ఇచ్చేశారని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. అరబింధో ఫౌండేషన్ లో విజయసాయి రెడ్డి అల్లుడు వుంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు. నారా లోకేష్,కన్నా లక్ష్మీ నారాయణ కూడా అవగాహన లేకుండా మాట్లాడుతూ వున్నారన్నారు.

కన్నా లక్ష్మీ నారాయణ బీజేపీ ని కాస్త టీజేపీ గా మార్చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కుల మతాలు కు అతీతంగా వైసిపీ పాలన సాగుతోంది. అవినీతి చేస్తే చట్టం ముందు ఎవరైనా సమానమే అన్నారు. జగన్మోహనరెడ్డి హయాంలో అవినీతి రహిత పాలన సాగుతోంది అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అవినీతి పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రతిపక్షంలో ఉన్న పుడే జగన్మోహన్రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 150 కోట్ల మందుల కొనుగోలు స్కాం లో అవినీతికి పాల్పడిన అచ్చెన్నాయుడు ను అరెస్ట్ చేస్తే లోకేష్ బాబు ఎందుకు బాధ పడుతున్నారు.

జేసీ ప్రభాకర్ రెడ్డి అక్రమాల పై విచారణ జరిపిస్తే లోకేష్, చంద్రబాబుకు వచ్చిన కష్టం ఏంటి అని ప్రశ్నించారు. టీడిపి హయాంలో అవినీతికి కర్త,కర్మ ,క్రియ లోకేష్,చంద్ర బాబు నాయుడులే అన్నారు. గతంలో అవినీతి ఆరోపణలపై సవాలు స్వీకరిస్తామని ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పే సరికి కన్నా కనిపించకుండా పోయారు.వైఎస్ హయాంలో ఫోన్ చేస్తే 108 లు వస్తే చంద్రబాబునాయుడు హయాంలో టైర్ లో గాలి లేదు ట్యాంక్ లో డీజిల్ లేదు అని సమాధానం వచ్చింది.

108 లను ఓ మినీ సూపర్ హాస్పిటల్ లుగా మార్చితే కన్నా లక్ష్మీనారాయణ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అరబిందో ఫౌండేషన్ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తే కన్నా లక్ష్మీ నారాయణ విమర్శలు చేయడం తగదు.

కన్నా లక్ష్మీనారాయణ అదేపనిగా విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదు.నిత్యం సీఎం జగన్..ఎంపీ విజయసాయి రెడ్డి విమర్శించి మీడియాలో కనిపించడం కన్నా కు అలవాటుగా మారింది. ఈ మీడియా సమావేశంలో 72వ వార్డు వైసిపీ కార్పొరేటర్ అభ్యర్థి, వైసిపీ నగర శాఖ సేవాదళ్ అద్యక్షుడు సిరట్ల శ్రీనివాస్, మహమ్మద్ షరీఫ్, నాగేంద్ర పాల్గొన్నారు.

## మల్కాపురం సి ఐ కూన దుర్గాప్రసాద్ కు అభినందనలు



గాజువాక: మల్కాపురం పోలీస్టేషన్ శాంతిభద్రతల విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల నూతన భాద్యతలను స్వీకరించిన కూన దుర్గాప్రసాద్ ను 40, 62వ వార్డుల కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థులు సుశీల, మరియదాస్ లు కలిసి అభినందనలు తెలిపారు. మంగళవారం స్టేషన్లో సి ఐ ని కలిసి స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శాంతిభద్రతలు కాపాడటంలో పక్షపాతం చూపవద్దని,భాదితులకు అండగా నిలవాలని కోరారు. సి ఐ కి అభినందనలు తెలిపిన వారిలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com